మట్టి పరీక్షలు 38.72 శాతమే



మట్టి నమూనాల పరీక్షలు

భూమి ఆరోగ్యంపైనే సాగు.. దిగుబడులు ఆధారపడి ఉంటాయి. ఇంతటి ప్రధానమైన మట్టి పరీక్షలపై ప్రభుత్వం పట్టుదలగా ఉంది. రైతులకు ఎంతో మేలు చేకూర్చే ఈ మట్టి పరీక్షలపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. ఖరీఫ్ సాగు మొదలైనా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కేవలం 38.72 శాతం మాత్రమే మట్టి పరీక్షలు జరిగాయంటే వ్యవసాయశాఖ శ్రద్ధ తెలుస్తోంది. భూసారం తేల్చేందుకు పెద్దఎత్తున పరీక్షలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా వాటిని చేరుకోవడంలో వ్యవసాయ శాఖ చతికిలపడింది. మట్టి నమూనాలను లక్ష్యాల మేర సేకరించడంతో సరిపెట్టిన వ్యవసాయశాఖ పరీక్షలపై దృష్టి సారించడం లేదు. అదేమంటే సిబ్బంది.. రసాయనాలు.. పరికరాల కొరత ఉందని అందువల్లే పరీక్షలు ఆశించిన మేర చేయలేకపోతున్నట్లు అధికారులు చెప్తున్నారు. 38.72 శాతం పరీక్షలకు సంబంధించిన పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ ఇప్పటికీ చేయలేదని రైతులు వాపోతున్నారు.

మందకొడిగా సాగుతున్న వైనం



నరసరావుపేటలోని భూసార పరీక్షల ల్యాబ్

- లక్ష్యంపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం
- ఖరీఫ్ సాగు మొదలైనా తేలని భూసారం
- వెంటాడుతున్న సిబ్బంది, రసాయనాల కొరత
- భూఆరోగ్య కార్డుల కోసం రైతుల ఎదురుచూపు

(వేమూరు, ఆంధ్రజ్యోతి)

మూడు నెలలుగా భూసార పరీక్షలు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పట్లో ఆ పరీక్షలు పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమునాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 23,284 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తి చేశారు. లక్ష్యాలు ఇచ్చిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వసతులు కల్పించడాన్ని విస్మరించింది. భూసార పరీక్షలు యజ్ఞంలా చేయాలని నిర్ణయించినా ఆచరణలో వ్యవసాయశాఖ విఫలమైంది. భూమిలో సారం ఎంత ఉందో మట్టి పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ పరీక్షల ఆధారంగా సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే పరీక్షలే పూర్తి కాకపోవడంతో (మిగతా 6లో)

శుభాల.. శ్రావణం



- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- పండుగలకు 'నెల'వు.. మహిళలకు ప్రీతిపాత్రం



శుభకార్యాలకు నెలవైన శ్రావణమాసం ఈనెల 25న ఆరంభం కానుంది. ప్రతి ఇల్లు ఓ ఆలయంగా మారి.. ఉదయం, సాయంత్రం వేళల్లో భగవన్నామస్మరణతో మార్మోగనుంది. మరో వైపు పెళ్లి బాజాలు ఘనంగా మోగనున్నాయి. ఈ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలను అధికారు లు, కమిటీ సభ్యులు ముస్తాబు చేస్తున్నారు. సామూహిక వరలక్ష్మీవ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకలు, రాఖీ పౌర్ణమి వరుసగా జరుగనున్నాయి. ఆషాఢం వీడి శ్రావణం మొదలు కానుండడంతో వ్యాపారులు, రైతులు కొత్త ఆశలు పెట్టుకున్నారు.

దివ్యాంగులకు వాహనయోగం

- ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం
- తొలిదశలో నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ
- త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ

ఇంజనీరింగ్ సీట్ల జాబితా విడుదల

ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా సీట్లు

8 26 లోపు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు




- అవలీలగా నకిలీ రిజిస్ట్రేషన్లు
- ఆ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు
- రూ.40 కోట్ల ఆస్తికి రిజిస్ట్రేషన్‌పై నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు

మామూళ్లతో.. మాయ

గుంటూరు సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒకరి పేరు నుంచి మరొకరి పేరుపై ఆస్తి మార్చాలంటే కట్టుదిట్టమైన పద్ధతి ఉంది. అయితే ఈ పద్ధతికి స్వస్తి పలుకుతూ మామూళ్లతో రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల పరిధిలోని రూ.40 కోట్ల ఆస్థి రిజిస్ట్రేషనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. భారీగా ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తుంది. కొద్దినెలల క్రితం ఉద్యో గ విరమణ పొందిన నరసరావుపేట జాయింట్ రిజిస్ట్రార్ ముందుగానే అన్నీ మాట్లాడుకుని నకిలీ రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం నల్లపాడు పోలీసుల అదుపులో ఉన్న కీలక నిందితుడు అక్రమ రిజిస్ట్రేషన్ గుట్టు విప్పినట్లు తెలుస్తుంది. నకిలీ దస్తావేజులు చేయడం ఆ విశ్రాంత జాయింట్ రిజి స్ట్రార్‌కు వెన్నతో పెట్టిన విద్య అని పలువురు చెప్తున్నారు. ఇతడే గుంటూరులో పనిచేసిన సమయంలో (మిగతా 6లో)

కుడి కాల్వకు సాగునీరు

- సాగర్ జలాశయం నుంచి విడుదల
- నీటి విడుదలతో అన్నదాతల్లో హర్షం
- 500 క్యూసెక్కులను క్రమేణా పెంపుదల
- వరద పోటెత్తుతుండటంతో ముందస్తు విడుదల



(నరసరావుపేట, మాచర్ల రూరల్, ఆంధ్రజ్యోతి)

భారీగా వరద పోటెత్తుతుండటంతో నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో సాగర్ జవహర్ కుడి కాల్వకు జలవనరుల శాఖ బుధవారం సాయంత్రం 6 గంటలకు సాగుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ఏఈలు భారతి, సుధా, అనిత, రమణ పాల్గొన్నారు. క్రమేపి నీటి విడుదలను 6,000క్యూసెక్కులకు పెంచనున్నారు. గత ఏడేళ్లలో జూలైలో సాగు నీటిని విడుదల చేయడం ఇదే ప్రథమం. నీటి విడుదలతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నీటి వనరుల కింద ఇప్పటికే రైతులు వరి నారుమళ్ల సాగు చేపట్టారు.ఈ వారంలో సాగు ముమ్మరం కానున్నది. నీటి విడుదలతో వరి విత్తనాల కొరత లేకుండా వ్యవసాయశాఖ చర్యలు చేప ట్టాల్సి ఉంది.ఇప్పటివరకు రాయితీ వరివిత్తనం పంపిణీని ప్రారంభించలేదు.

పెరిగిన వరద ప్రవాహం..

సాగర్ జలాశయానికి బుధవారం వరద ప్రవాహం పెరిగింది. 1,21,967 క్యూసెక్కుల వరద వస్తుంది. శ్రీశైలానికి వరద పెరగడంతో సాగర్ జలాశయంలో కూడా నీటి మట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి 3374, కుడి కాల్వకు 500, ఎస్ఎల్‌బీసీకి 1800, ఎడమ కాల్వకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ 312.04 టీఎంసీలు కాగా బుధవారం సాయంత్రానికి 264.10 టీఎంసీలకు(573 అడుగులు) చేరింది.



వరద ఉధృతికి.. కొట్టుకుపోయిన గాలుమార్గం

కొల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో గాజుల్లంక-శ్రీకాకుళం వెళ్లేందుకు తాత్కాలికంగా ఇరు గ్రామాల ప్రజలు వేసిన గాలుమార్గం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. మంగళవారం రాత్రి కృష్ణానదికి వరద ఉధృతి పెరగడంతో మార్గం కింద వేసిన తూముల వద్ద కోతకు గురైంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కృష్ణానదిలో వరద నీరు అంతకు అంతకు పెరగడంతో పలు చోట్ల గాలు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. గత జనవరి నుంచి ఇప్పటి వరకు తాత్కాలిక మార్గం ఇరుజిల్లాల ప్రజలకు ఉపయోగపడింది. వరద ప్రవాహంతో గాలుమార్గం తెగిపోవడంతో కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు పెనుమూడి వారధిపై నుంచి వెళ్లాల్సి ఉంది.

ప్రమాదాల జోరు.. హెచ్చరికలు ఏవి సారూ?

- జాతీయ రహదారి వద్ద రోజుకో ప్రమాదం
- కనిపించని ప్రమాద సూచికలు

బాపట్లరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వెదుళ్ళపల్లి, బాపట్ల ప్రాంతాల మీదగా వెళ్ళే జాతీయ రహదారి నుండి బాపట్ల పట్టణంలోకి వెళ్ళేందుకు ఉన్న రోడ్డును గత రెండు సంవత్సరాలు క్రితం వెడల్పు చేసి డివైడర్‌లను వేశారు. రోడ్డు వెడల్పు చేయటంతో పట్టణంలోకి వాహనాల రాకపోకలు ఎక్కువ య్యాయి. వాహనాలు అధిక వేగంతో రావటంతో అధికంగా రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం రోడ్డుపై ప్రమాద హెచ్చరికబోర్డులు లేకపోవటమే. గతంలో బాపట్ల మండలం వెదుళ్ళపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ సమీపంలోని జాతీయ రహదారి మలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇసుక డ్రమ్ములు శిధిలావస్థకు చేరి రోడ్డుపక్కనే నిరూపయోగంగా పడిఉన్నాయి. హెచ్చరికబోర్డులు లేకపోవటం వలన ఇటీవల వెదుళ్ళపల్లి సెంటర్ రహదారిపై మలుపు వద్ద కారు వేగంగా ఎదురొస్తున్న ద్విచక్రవాహన్ని ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం డివైడర్‌ను వేగంగా ఢీకొట్టగా ఓ మహిళ అక్కడికక్కడే మృత్యువాత పడినది. ఇలా చెప్పుకుంటూ పోతే బాపట్ల మండలం వెదుళ్ళపల్లి బాపట్ల ప్రాంతాలలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాలలో పదుల సంఖ్యలో మృత్యువాతపడగా ఎంతోమంది గాయాలపాలయ్యారు. గతంతో ప్రమాదాల నివారణకు హెచ్చరికబోర్డులు ప్రధాన కూడలిలో ఏర్పాటు చేశారు, ఇప్పుడు అవి కనుమరగుఅయిపోయాయి. రోడ్డుప్రమాదాలు రోడ్డుమలుపుల వద్ద హెచ్చరికబోర్డులు లేకపోవటం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున సంబంధిత పోలీసు, రోడ్డు రవాణా ఉన్నతాధికారులు బాపట్ల మండలం వెదుళ్ళపల్లి, బాపట్ల ప్రాంతాల సమీపంలో ఉన్న రహదారులపై ప్రమాదాల నివారణకు హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది.



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని బాపట్ల వైజంక్షన్‌రోడ్డు దృశ్యం



జాండ్రపేట ప్రధాన రహదారిలో వీధి కుక్కలు

వీధికుక్కల వీరంగం

- పాదచారులపై ఎగబడుతోన్న కుక్కలు
- ఇటీవల కుక్కకాటు.. రేబిస్‌తో మహిళ మృతి

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పల్లె పట్టణం అన్న తేడా లేకుండా ఎక్కడంటే అక్కడ వీధి కుక్కల వీరంగంతో చిన్నారుల నుంచి పెద్దలు వరకు భీతిల్లిపోతున్నారు. ఒంటరిగా రోడ్లపైకి రావాలంటే వెనుకంజ వేస్తున్నారు. సందుగొందుల్లో సైతం గుంపులుగుంపులుగా సంచరిస్తోన్న శునకాలు కనిపించిన వారిపై దాడి చేస్తున్నాయి. చీరాల నియోజకవర్గ పరిధిలోని ఈపూరుపాలెం, తోటవానిపాలెం, జాండ్రపేట, రామన్నపేట, పందిళ్లపల్లి, వేటపాలెం ప్రాంతాల్లో, పేరాల, చీరాలలో విద్యార్థులపై నిత్యం దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులపైకి ఎగబడుతున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు చేయాలంటే భయాందోళన చెందుతున్నారు. ఇటీవల స్థానిక లక్ష్మీపురంలో కుక్క కాటుకు గురైన కామేశ్వరమ్మ అనే మహిళ ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతూ రెండో రోజే రేబిస్‌తో మృతి చెందింది. ఈపూరుపాలెం ప్రధాన రహదారి, సీతారామపేట, మార్కెట్ సెంటర్, పట్టణంలోని ఏరియా హాస్పిటల్ రోడ్డు, ఈపూరుపాలెం, తోటవారిపాలెం, జాతీయ రహదారిలోని మోడల్ స్కూల్ వద్ద శునకాలు భయంగొల్పుతున్నాయి.

జిల్లాలో నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధం

- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు
- కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల,జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో నల్ల బర్లీ పొగాకు సాగును నిషేధిస్తున్నట్లు, రైతులు ప్రత్యామ్నాయ పంటు సాగు చేయాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖాధికారులు, ప్రైవేట్ బయ్యర్లతో మాట్లాడుతూ ఆదేశాలను ఉల్లంఘించే రైతులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఏడాది కంపెనీల హామీలతో రైతులు అధికంగా నల్ల బర్లీ పొగాకు సాగు చేశారని తెలిపారు. అయితే కొనుగోలు సమయంలో కొన్నికంపెనీలు వెనుకడుగు వేసిన నేపథ్యంలో రైతులను ఆదుకోవటానికి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. గతంలో డిమాండ్‌కు మించి సాగు జరగటం వల్ల మార్కెట్‌లో ధరలు గణనీయంగా పడిపోయాయన్నారు. ఇది రైతుల ఆర్ధికపరిస్థితిపై తీవ్రప్రభావం చూపిందని వివరించారు. ఈపరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో బ్లాక్ బర్లి పంటసాగు చేయకూడదని, ఇది పూర్తిగా నిషేధితమని పునరుద్ఘాటించారు. ఈనిబంధనలను ఎవరు ఉల్లంఘించిన వ్యవసాయాధికారులు పంటను ధ్వంసం చేయటంతోపాటు నేరుగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఇప్పటికే పండించిప పొగాకును రైతులు ప్రైవేట్ కంపెనీలకు విక్రయించవచ్చుఅని చెప్పారు. రైతులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలని, ప్రతిరైతుకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రస్తుతం రైతు పండించిన చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

15 లోపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఏవీ నాగేశ్వరరావు, వేదికపై సీఐటీయూ నాయకులు

గుంటూరు(తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15లోపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. పాత గుంటూరు, శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో రెండు రోజులు పాటు జరిగే భవన నిర్మాణ కార్మికుల సంఘ రాష్ట్ర మహాసభలను బుధవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చే కన్నా ప్రజల నుంచి పన్నుల పేరుతో వసూలు చేసేది ఎక్కువైందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అనుస రిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికవర్గం చైతన్యంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆర్వీ నరసింహారావు, మహిళా రాష్ట్ర నాయకులు దయారామాదేవి ప్రసంగించారు. తొలుత సీఐటీయూ జెండాను వి ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. మహాసభకు రమణారావు అధ్యక్షత వహించగా, సభలో సీఐటీయూ నాయకులు, పలు జిల్లాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజి బాధిత రైతులకు చెక్కుల పంపిణీ


రైతుల బీమా పత్రాలను తనిఖీ చేస్తున్న దుగ్గిరాల యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు

దుగ్గిరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాద బాధిత రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రక్రియ బుధవారం కొనసాగింది. పంటబీమా నగదు కింద చెక్కుల పంపిణీలో భాగంగా దుగ్గిరాల మార్కెట్‌యార్డులో సోమవారం ప్రారంభం కాగా, రెండ్రోజుల పాటు తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. బీమాసంస్థ నుంచి వచ్చిన జాబితా ప్రకారం 346 మందికి బీమా మొత్తం అందించాల్సి ఉంది. వీరిలో 332 మంది రైతులు, 14 మంది వ్యాపారులు ఉన్నారు. మొత్తం రూ.22.50కోట్లు మంజూరు కాగా వ్యాపారులకు చెందిన 42 బాండ్లకు సంబంధించి రూ.2.76కోట్లు మంజూరు చేశారు. దుగ్గిరాల ఏఎంసీ, తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మూడ్రోజుల్లో 308 మంది ఖాతాల్లో రూ.19.5కోట్లు నగదు జమచేశారు. మిగిలిన 24 బాండ్లకు సంబంధించి నగదు చెక్కులను పంపిణీ చేయాల్సి ఉందని, వారికి ఫోన్‌ద్వారా సమాచారం అందించగా, అందుబాటులో లేమని కొందరు చెప్పారన్నారు. వారందరి ఖాతాల్లో నగదు జమపై ఉన్నతాధికారుల ఆదేశాను సారం నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.

పేదల జీవనప్రమాణాలు పెంచడమే.. పీ-4 ముఖ్య ఉద్దేశం

పోస్టర్ల ఆవిష్కరణలో మంత్రి మనోహర్


సచివాలయంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జూలై23(ఆంధ్రజ్యోతి): పేదల జీవనప్రమాణాలను పెంచేందుకే కూటమి ప్రభుత్వం పీ-4 కార్యక్రమాన్ని చేపట్టిందని, 2029 నాటికి 50లక్షల పేద కుటుంబాలు అభివృద్ధివైపు నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అమరావతి సచివాలయంలో బుధవారం మంత్రి మనోహర్ తెనాలి విజన్‌యాక్షన్ ప్లాన్‌పై నియోజవర్గ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మంది పేదలు తరాలు మారుతున్నా అందులోనే మగ్గుతున్నారని చెప్పారు. అటువంటి కుటుంబాలను సైతం ఆర్థికంగా నిలదొక్కుకుని అభివృద్ధిలోకి వచ్చేలా పీ-4 (పబ్లిక్ - పీపుల్ - ప్రైవేట్ - పార్టనర్‌షిప్) ప్రోగ్రాంను చేపట్టడం జరిగిందన్నారు. తెనాలి ప్రాంతంలో ఉన్న పేదలను గుర్తించి పీ-4లో భాగస్వాములను చేసేందుకు ఇప్పటికే అధికారయంత్రాంగం నడుంబిగించిందన్నారు. తెనాలి నియోజవర్గంలో సుమారు 14280 (పేదలు) బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. వారికి అండగా నిలిచేందుకు 376మంది ముందుకు వచ్చారన్నారు. వీరు దాదాపు 3289మందిని దత్తత తీసుకోనున్నట్లు తెలియజేశారు. డేటా వెరిఫికేషన్ అనంతరం వీరి సహాయంతో వారి అభివృద్ధికి అవసరమైనవిధంగా ఉపాధి పొందేందుకు, చదువులకు తోడ్పాటు, వ్యవసాయ సాగుకు, మార్కెటింగ్, బ్యాంక్ రుణాలు ఇప్పించడం, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి వైద్య సహాయం తదితర విషయాల్లో చేయూతనందించడం జరుగుతుందన్నారు. త్వరలోనే మార్గదర్శకులను పరిచయం చేసేలా కార్యక్రమాన్ని తెనాలిలో నిర్వహించనున్నట్లు మంత్రి మనోహర్ వెల్లడించారు. ఈ యాక్షన్ ప్లాన్ తెనాలి నియోజకవర్గానికి ఒక రోల్‌మోడల్‌గా మారుతుందన్నారు. ఎన్నారైలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న తెనాలి వాసుల సహకారం తీసుకుంటూ వారిని భాగస్వాములుగా మార్చే ప్రణాళిక చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత పీ-4 వాల్ పోస్టర్లను అధికారులతో కలిసి మంత్రి మనోహర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సంజనసింహ, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవోలు అత్తోట దీప్తి, విజయలక్ష్మి, మునిసిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావు, స్వర్ణాంధ్రవిజన్ మేనేజ్‌మెంట్ యూనిట్ అధికారులు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి వర్సిటీ స్నాతకోత్సవం నేడు

ఎన్‌జీ రంగా యూనివర్సిటీ వీసీ శారదా జయలక్ష్మీదేవి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శారదా జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ), జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవం వేడుకలను గన్నవరం మండలం ఆత్కూర్ గ్రామంలోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో గురువారం నిర్వహించనున్నట్లు వీసీ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారని తెలిపారు. విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థి అయిన మాజీ ఐఏఎస్ ఏ వేణుప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. 2023-24 సంవత్సరంలో 1419 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, 1995 మంది విద్యార్థులు వివిధ కోర్సులలో చేరారని తెలిపారు. డిప్లొమాలో 2023-24లో 1016 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. పీజీ కోర్సుల్లో 196 మంది, పీహెచ్‌డీలో 46 మంది విద్యార్థులు స్నాతకోత్సవంలో పట్టాలు పొందేందుకు అర్హత సాధించారన్నారు. స్నాతకోత్సవంలో వ్యవసాయ పరిశోధనల్లో అత్యుత్తమ ప్రతిభకు రెండు జాతీయ అవార్డులను ఇస్తున్నట్లు తెలిపారు. సాంబమసూరు బియ్యం రకాన్ని కనుగొన్న డాక్టర్ ఎంవీ రెడ్డి, స్వర్ణ రకాన్ని కనుగొన్న వీ రామచంద్రరావు పేర్ల మీద జాతీయస్థాయిలో అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా పేరుమీద యువ శాస్త్రవేత్త పురస్కారాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. యోగ్య ఉపాధ్యాయ పురస్కార గ్రహీత అవార్డులు 4, యోగ్య పరిశోధనా పురస్కార గ్రహీతలు 3, యోగ్య విస్తరణ పురస్కార గ్రహీత అవార్డులు 2 ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులపై వైసీపీ కార్యకర్తల దాడి

ఇద్దరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలు నంబుల కాట్రాజు, మాగంటి బాబూరావు

సత్తెనపల్లి రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ళలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు మాగంటి బాబూరావు తన గొర్రెలతో పాటు తన బంధువులకు చెందిన గొర్రెలను పొలంకు తోలుకు వెళ్ళి సాయంత్రం కావటంతో ఇంటికి తోలుకొని వస్తున్నాడు. మార్గ మధ్యలోకి వచ్చే సరికే వర్షం కురవటంతో పక్కన పొలాల్లో(దుక్కిలో) నిలుపి వేశాడు. ఈ సమయంలో గ్రామానికి చెందిన వల్లెపు రాంబాబు తన మిరప నారు మడుల వద్దకు వెళ్తూ గొర్రెలు ఇక్కడ ఎందుకు ఆపావు?, పక్కన మిరప నారు మడులు ఉన్నాయి, తొందరగా తోలుకు వెళ్ళు అని హెచ్చరించాడు. రాంబాబు నారు మడి వద్ద నుంచి తిరిగి వచ్చే సరికే గొర్రెలు అక్కడే ఉండటంతో నిన్ను గొర్రెలు తోలుకు వెళ్ళమంటే ఇక్కడే ఉంచావేంటంటూ తనను గొంతు పట్టుకొని నెట్టాడని బాబూరావు విలేకరులకు తెలిపారు. ఈ సమయంలో ఇరువురు ఒకరికొకరు నెట్టుకున్నారు. ఈ క్రమంలో నువ్వు ఊళ్ళోకి వస్తావో చూస్తానని బాబూరావును రాంబాబు హెచ్చరించాడు. ఈ క్రమంలో వల్లెపు వీరయ్య, రవితేజ, మరికొందరిని తీసుకొని గొర్రెలు తోలుకు వస్తున్న బాబూరావు వద్దకు వెళ్ళి ఘర్షణ పడ్డాడు. బాబూరావు తరపు వారు కూడా రావటంతో రాంబాబు, అతని వర్గీయులు బాబూరావు, నంబుల కాట్రరాజు, మరికొందరిపై కర్రలు, గొడ్డళ్ళతో దాడి చేశారు. ఈ ఘటనలో బాబూరావు, కాట్రరాజు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బంధువులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. తాము టీడీపీకి చెందిన వారమనే గొర్రెలు నారు మడిలో పడక పోయినా తమపై దాడి చేసి కొట్టారని బాబూరావు ఆరోపించారు. ఈ ఘర్షణలో వైసీపీకి చెందిన ఇద్దరికి కూడా స్వల్ప గాయాలైనట్టు సమాచారం. ఈ విషయంపై ఇరు వర్గీయులు సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వల్లెపు రాంబాబు ఫిర్యాదు పై మాగంటి బాబురావు మరో ముగ్గురిపై, మాగంటి బాబూరావు ఫిర్యాదు మేరకు వల్లెపు రాంబాబు, మరో ఇద్దరి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు.

ప్రాణాలమీదకు తెచ్చిన ప్లాస్టిక్ డబ్బా

● డ్రెయినేజీలో ఇరుక్కున బాలుడు ● రక్షించిన మున్సిపల్ సిబ్బంది


ప్రాణాలతో బయట పడ్డ తుపాకుల రాంబాబు

వినుకొండటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాత ప్లాస్టిక్ డబ్బాల కోసం వెళ్లి డ్రెయినేజీ పైపులో ఓ బాలుడు ఇరుక్కు న్న సంఘటన పట్టణంలోని నరసరావు పేట రోడ్డులో గల గంగినేని కల్యాణ మండపం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే... డ్రైవర్ కాలనీలో నివాసం ఉంటున్న తుపాకుల వెంకటేశ్వర్లు, కృష్ణవేణిలకు ఆరుగురు సంతానం. ఐదుగురు మగ సంతానం కాగా ఒక కుమార్తె కలదు. చివరి సంతానంగా జన్మిం చిన తుపాకుల రాంబాబు తోటి స్నేహితులైన అంకయ్య, మ హం కాళి, అంకమ్మరావులతో కలిసి పాత డబ్బాలను ఏరుకునేందుకు డ్రైనే జీ వద్దకు చేరుకున్నారు. డ్రైనేజీ పైపులో పేరుకుపోయిన డబ్బాలను వెలికితీస్తూ ముందుకు సాగుతూ పైపులో అతను ఇరుక్కుపోయాడు. ఇదే సమయంలో మురుగునీరు పైపులోకి ప్రవేశించడంతో ఊపిరాడక కేకలు వేశాడు. దీంతో సమీపంలోని స్నేహితులు రోడ్డుపై వెళ్లే వాహ నదారులకు సమాచారం చేరవేడయంతో వారంతా పైపువద్దకు వెళ్లి బాలుడిని వెలికితీసేందుకు ప్రయత్నించాడు. సుమారు గంట సేపు బాలుడిని వెలికితీసేం దుకు తీవ్ర ప్రయత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్‌తో కలసి సంఘటనా ప్రాంతా నికి చేరుకొని డ్రెయినేజీ పైపును చాకచక్యంగా పగలగొట్టి బాలుడిని వెలికితీసి వైద్యం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రా ణాపాయం లేదని తెలపడంతో ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు.

మామూళ్లతో.. మాయ

(5వ పేజీ తరువాయి)

మానస సరోవరాన్ని కూడా పలువురికి రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. కలెక్టర్ జోక్యంతో సదరు దస్తావేజులు రద్దు చేసినట్లు తెలిసింది. పిడుగురాళ్ల, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో కొన్ని వందల నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలులో జరిగిన నకిలీ చలానాల కుంభకోణంలో కూడా ఆయన పాత్ర ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని తప్పులు చేసినా కొందరు అధికారులు ఆయనను వెనకేసుకు రావడం వల్ల ఇటువంటి వ్యవహారాలు పదే పదే జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గుంటూరులోని గోరంట్లలో రూ.40 కోట్ల ఆస్థి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఇదే జాయింట్ రిజిస్ట్రార్ భారీగా నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ సీనియర్ అసిస్టెంట్‌తోనే 18 జీపీఏ చేయించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పల్నాడులో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆ సీనియర్ అసిస్టెంట్‌పై కూడా కేసు నమోదు చేయాలని బాధితులు పోలీసులను కోరినట్లు తెలుస్తుంది. ఇప్పటికే నల్లపాడు పోలీసులు నరసరావుపేటలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జాయింట్ రిజిస్ట్రార్, గుంటూరుకు చెందిన మరో రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేశారు.

నకిలీ మనిషిని తెచ్చినా ఓకే..

వాస్తవానికి రూ.40 కోట్ల ఆస్థికి సంబంధించిన అసలు వ్యక్తి కొత్తపల్లి పద్మజ మృతి చెందారు. ఆమె ఆధార్ కార్డు ఆధారంగానే ఆస్థి బదలాయింపు జరగాలి. రిజిస్ట్రేషన్ సమయంలో అసలు యజమాని వేలిముద్రలు కూడా సరిపోలాలి. మామూళ్ల మత్తులో ఉన్న నరసరావుపేట విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ అన్నిటినీ తేలికగా మార్చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరించి అసలు ఆస్థి వరులను వివాదంలోకి నెట్టారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు కొరిటపాడులో అనుమతి ఇచ్చారని సమాచారం.

డీఐజీ జోక్యంతో..

రూ.40 కోట్ల ఆస్థికి నకిలీ రిజిస్ట్రేషన్‌పై బాధితుడు కొత్తపల్లి శ్రీనివాసరావు అప్పట్లో నరసరావుపేట వెళ్లి అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదు. దీంతో బాధితుడు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ గుంటూరు డీఐజీకి ఫిర్యాదు చేయడంతో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్ హడావిడిగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పట్లో నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు చేశారు.

ఐదు రోజుల పాటు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీటీర్ వర్కులు కారణంగా ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని ఐదు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు సీపీటీఎం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 22876 గుంటూరు - విశాఖపట్టణం, 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏషియన్ పోటీలకు స్కేటర్ జెస్సీరాజ్



మంగళగిరి సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలో ఈ నెల 24 నుంచి పది రోజులపాటు జరగనున్న ఏషియన్ చాంపియన్‌షిప్ స్కే టింగ్ పోటీలకు మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ మాత్రపు జెస్సీరాజ్ ఎంపికైంది. భారత జట్టు తరపున ఎంపికైన 29 మం ది సభ్యుల బృందంతో కలిసి మంగళవారం దక్షిణ కొరియా తరలివెళ్లింది. క్యాడెట్ గర్ల్స్ విభాగంలో ఏపీ నుంచి పాల్గొనే ఏకైక క్రీడాకారిణి జెస్సీరాజ్ మాత్రమే.

పూణే గోవింద్ డెయిరీని సందర్శించిన సంగం బృందం



ధూళిపాళ్ల నరేంద్రకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న పూణేలోని గోవింద్ డెయిరీ యాజమాన్యం

పొన్నూరుటౌన్, జూలై23(ఆంధ్రజ్యోతి): పూణేలోని గోవిందు డెయిరీ అవలంబిస్తున్న పశు వైద్య చికిత్సలను అధ్యయనం చేసి స్థానిక రైతులకు మెరుగైన పశు వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు సంగం డెయిరీ ఛైర్మన్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం మహారాష్ట్ర పూణేలోని గోవింద్ డెయిరీని సంగం బృందం సందర్శించింది. అక్కడి రైతులు అవలంబిస్తున్న పశు వైద్య చికిత్సలో పాటిస్తున్న ఆయుర్వేద పద్ధతులు, లూస్ హౌసింగ్ వంటి ప్రక్రియలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోవింద్ డెయిరీ ఛైర్మన్ సంజీవ్ రాజే నాయక్, డెయిరీ అవలంబిస్తున్న సాంకేతిక వనరులు సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఓఓ పర్వతనేని అనిల్, పశు వైద్య బృందం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

● పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య బ్రహ్మజీరావు

పెదకాకాని, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి బీటెక్,ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంలో సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్,కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ కోర్సులలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరి సీట్ల భర్తీకి బుధవారం నిర్వహించిన ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసిందని పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య పీ బ్రహ్మజీరావు బుధవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 114 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 86 మంది హాజరయ్యారన్నారు. ఫలితాలను త్వరలో విడుదల చేస్తామన్నారు. ఆయా కోర్సులలోని సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరి సీట్లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని ఆయన వివరించారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి


మృతుడు నరసింహారావు

రెంటచింతల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి చెందిన సంఘటన బుధవారం రెంటచింతల నుంచి మిట్టగుడిపాడు వెళ్లే రహదారిలో ఏడుమంగళం వాగు ఒడ్డున సంభవించింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా వున్నాయి. మంచికల్లు గ్రామానికి చెందిన బొమ్మనబోయిన నరసింహారావు(42) రెంటచింతల పరిసరాల్లో 30 ఎకరాలను కౌలుకు తీసుకుని సేద్యం ప్రారంభించారు. మాగాణి పొలానికి వెళ్లి బోర్ మోటార్‌ను స్టార్ట్ చేసే క్రమంలో చేయి ప్యానల్ బాక్స్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే ప్రాణాలిడిచారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం. భార్య నాగ లీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

శబరి ఎక్స్‌ప్రెస్‌కు గుంటూరులో 10 నిమిషాల హాల్ట్

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌కు ఇప్పటివరకు గుంటూరు రైల్వే జంక్షన్‌లో ఒక నిమిషం మాత్రమే హాల్టింగ్ సమయం ఉండగా సెప్టెంబరు 29వ తేదీ నుంచి అది 10 నిమిషాలకు పెరగబోతున్నది. దీని వలన ఆ రైలులోకి ప్రయాణికులు బోర్డింగ్/అన్‌బోర్డింగ్ చేయడం సులభతరం అవుతుంది. పైగా ఇక్కడే వాటరింగ్ కూడా పెట్టనుండటంతో టాయిలెట్స్, వాష్‌బేసిన్‌లలో నీటి సమస్యలు కూడా తొలగిపోతాయి. తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం గుంటూరుకు ఉదయం 6.29కి వచ్చి 6.30కి బయలుదేరుతున్నది. దీనివలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పైన ప్రకటించిన తేదీ నుంచి ఈ రైలు గుంటూరుకు ఉదయం 6.05కి వచ్చి 6.15కి బయలుదేరుతుంది. ఈ కారణంగా సత్తెనపల్లికి 6.54కి, పిడుగురాళ్లకు 7.19కి, నడికుడికి 7.39కి, సికింద్రాబాద్‌కి 11 గంటలకు చేరుకొంటుంది. అలానే సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ మారనున్న షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 4.59కి నడికుడి, 5.19కి పిడుగురాళ్ల, 5.49కి సత్తెనపల్లి, 6.35కి గుంటూరుకు వచ్చి 6.45కి బయలుదేరుతుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ నుంచి అధికారిక సమాచారం బుధవారం డివిజన్ ఆఫీసులకు చేరింది.

మట్టి పరీక్షలు.. 38.72 శాతమే

(5వ పేజీ తరువాయి)

సాగు పరిస్థితి తారుమారవుతోంది. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలు మొక్కుబడిగా సాగుతుండటంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు, బాపట్ల కంటే పల్నాడులో పర్వాలేదు..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు చేసే సామర్థ్యం మాత్రమే ల్యాబ్‌కు ఉంది. జిల్లాలో 23,437 మట్టి నమునాల పరీక్షల లక్ష్యం కాగా 23,191 మట్టి నమూనాలను సేకరించారు. 12,005 నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల కంటే పల్నాడు జిల్లాలోనే పరీక్షల నిర్వహణ మెరుగ్గా ఉంది. బాపట్ల జిల్లాలో లక్ష్యం మేర 22,688 సేకరించి 7785 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 13,862 సేకరించగా 3494 పరీక్షలు పూర్తయ్యాయి. పరీక్షలు ఇలా జరిగితే ఏడాది చివరికి కూడా పూర్తికావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సూక్ష్మ పోషకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మట్టి పరీక్షలు తేలక పోవడంతో ఆయా సూక్ష్మపోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది. సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా సూక్ష్మపోషకాలను ప్రభుత్వం పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో భూసార పరీక్షలు ఇప్పటికైనా వేగవంతం చేయాల్సి ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

50,048 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,954 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,048 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,222 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12500
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	----
4884	----	----	341	10000	13600
సూపర్ 10	----	----	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు సమస్య వివరిస్తున్న తీరప్రాంత గ్రామాల రైతులు

తీరప్రాంత గ్రామాల రైతుల ఆందోళన

● అండగా ఉంటామని ఎమ్మెల్యే వేగేశన హామీ

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని కట్టవాద గ్రామంలో రాజుకాలవ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలిగించటం వల్ల తీరప్రాంత గ్రామాల పరిధిలోని వ్యవసాయభూములకు నీరందక ఇబ్బందులు పడుతామని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కట్టవాద, నర్రావారిపాలెం, మర్రికట్టవ, పెదపులుగువారిపాలెం తదితర గ్రామాల రైతులు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన తీసుకుంటామని హామినిచ్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నష్టం జరిగే ఏ ఒక్క చర్యను సమర్థించబోమని తెలిపారు. ఎమ్మెల్యే హామీతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్లను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఆర్‌వో మాట్లాడుతూ పాఠశాలల్లో, కళాశాలల్లో ఈగల్ టీమ్‌లను ఏర్పాటు చేసి మాదకద్రవ్య వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి ఏరూపంలో ఉన్న అది ఎక్కడ నుంచి వస్తున్నది దానిని నిర్మూలించే ఉద్దేశ్యంతో ఈగల్ ఆపరేషన్ సంస్థను రాష్ట్ర పోలీసుశాఖ ఏర్పాటు చేసిందని క్రైమ్ డీఎస్పీ జగదీష్‌నాయక్ తెలిపారు. అందరి సహకారంతో జిల్లాలో ఇప్పటి వరకు 73 కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. జాతీయ రహదారిపై మార్టూరు టోల్‌ప్లాజా దగ్గర నిరంతర తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, పోర్ట్ అధికారి బీవీఎం మూర్తి, ప్రొహిబిషనల్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమాధికారి జె.రాజాదెబోరా, దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారి సువార్త, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, షాడో స్వచ్ఛంద సంస్థ ఎన్జీవో రాజా సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోకు జాయింట్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు

జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్‌కు జాయింట్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ బదిలీ కావటంతో అప్పటి నుంచి జాయింట్ కలెక్టర్ బాధ్యతలు కూడా కలెక్టర్ జె.వెంకటమురళి నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం డిఆర్‌వోకు అదనపు బాధ్యతలు అప్పగించటంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన

బాపట్ల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా పోలీసు ఆధ్వర్యంలో బాపట్ల ఫార్మసీ కళాశాల విద్యార్థులకు శక్తియాప్‌పై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. సైబర్ క్రైమ్, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలైన యెడల హెల్ప్‌లైన్ నెంబర్‌లకు ఏవిధంగా కాల్ చేయాలో వివరించారు.

పౌరుషానికి ప్రతీక ప్రకాశం పంతులు

● ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య డీవీఆర్ మూర్తి

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల ధైర్యసాహసాలకు, పౌరుషానికి ప్రతీక ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం అని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య డీవీఆర్ మూర్తి అన్నారు. బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల సంయుక్త ఆధ్వర్యంలో స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రకాశం చూపిన తెగువ జాతీయ స్థాయిలో ఆంధ్రులకు ప్రత్యేక గుర్తింపును, కీర్తిప్రతిష్ఠలను ఆర్జించి పెట్టిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం ధైర్యసాహసాలు, దేశభక్తి నేటియువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం అధ్యయన కమిటీ అధ్యక్షుడు టి.మోహనరావు, కార్యదర్శి టంగుటూరి శ్రీరామ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డబ్ల్యూజీకే మూర్తి, ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవి రత్నగుప్తా, నాయకులు యువి రామారావు, విశ్రాంత అధ్యాపకులు జి.శాంతారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అవినాష్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు బందాబాబు, న్యాయవాదులు భానుప్రకాష్, కె.రవిబాబు, సీతారామాంజనేయులు, చలపతిరావు, చిత్రకారుడు జీవీ, మానం అప్పారావు, గర్నేపూడి వెంకటేశ్వర్లు, అబ్దుల్ కలాం, ఇక్కుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో మహాసుదర్శనయాగం

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీమహర్షి ఆశ్రమ గోశాలలో బుధవారం మాస శివరాత్రి, అరుద్ర నక్షత్రం సందర్భంగా భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు కొండమూడి బంగారుబాబు ఆధ్వర్యంలో మహాసుదర్శన యాగం జరిగింది. గోపూజ, మహాప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు మాట్లాడుతూ వర్షాలు సకాలంలో పడి పంటలు బాగా పండాలని కోరారు. బీజేపీ కార్యకర్తల సహకారంతో పార్టీని బలోపేతం చేసే శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు పి.బాబునాగేంద్ర, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మామిడి రమేష్‌కుమార్, కొలగాని సునిత, మేడికొండ భరణిరావు, ప్రధాన కార్యదర్శి కొత్రా వెంకటరామకృష్ణ, కాకర్ల వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షులు బ్రహ్మాండం బాలనారాయణ, షేక్.కరీముల్లా, శ్రీనివాసరాజు, కొండారెడ్డి అనీల్‌కుమార్, బక్కా మనోహర్‌రెడ్డి, శేషగిరి పాల్గొన్నారు.



మహాసుదర్శనయాగం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు తదితరులు

కూటమి పాలనలో ప్రజలకు తీరని అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరుగుతున్నదని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆరోపించారు. పట్టణంలోని 24వ వార్డులో బుధవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణం నిలిచిపోవటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, వార్డు నాయకులు ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రఘుపతి మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జాలిరెడ్డి, బుల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు సహాయం చేసేలా చర్యలు

● కలెక్టర్ జె.వెంకటమురళి



పీ4పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీ4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు సహాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పీ4 కార్యక్రమం అమలు చేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీ4 కార్యక్రమం కింద గుర్తించిన బంగారు కుటుంబాలకు ఏవిధంగా సహాయం చేయాలో సానుకూలంగా సహాయం చేయటానికి అవసరమైన మార్గదర్శులను గుర్తించాలని చెప్పారు. గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి బంగారు కుటుంబాలను ఎంపిక చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు జీవనోపాధులు కల్పించటానికి బ్యాంక్ రుణాలు, గేదెలు, గొర్రెల పెంపకం తదితర కార్యక్రమాలు అమలు చేయాలని ఆయన చెప్పారు. ఈనెల 25తేదిలోగా బంగారు కుటుంబాల వివరాలను, మార్గదర్శుల వివరాలను తయారు చేయాలని అధికారులకు చెప్పారు. బంగారు కుటుంబాలకు కావాల్సిన సౌకర్యాలను యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, జిల్లా గ్రామీణ నీటిసరఫరా శాఖాధికారి అనంతరాజు, ఆర్డీవో పి.గ్లోరియా, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్‌లు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

'అక్షర ఆంధ్ర' విజయవంతంగా నిర్వహించాలి

జిల్లాలో అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత పెంపునకు బహుశాఖల సమన్వయంతో పని చేయాలన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో వయోజన విద్యాకేంద్రాల ఏర్పాటుపై దృష్టిసారించాలన్నారు. ఉల్లాస్-అక్షర ఆంధ్ర కార్యక్రమంలో జీవితాంతం నేర్చుకునే అవకాశాల కల్పన కోసం కేంద్ర ప్రణాళికలు రూపొందించటం జరిగిందన్నారు. అక్షరాంధ్ర అమలులో వలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల పాత్ర కీలకమన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమం స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అమలు చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో పీ4 మార్గదర్శులతో గ్రామాలలో ఉన్న నిరక్షరాస్యులను మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఐసిడిఎస్ పీడీ రాధా మాధవి, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ పనితీరును వేగవంతం చేయాలి : కలెక్టర్

రెవెన్యూశాఖ నిర్వహించే వివిధ అంశాలు, పనితీరును వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బుధవారం రెవెన్యూశాఖాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఆధార్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 25వ తేదిలోపు వెబ్‌ల్యాండ్‌లో మార్పులు,చేర్పులను పూర్తి చేయాలని చెప్పారు. నివేశన స్థలాల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్డీవోలకు సూచించారు. ప్రతిరోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ పనుల పురోగతిని ఆర్డీవోలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కనకరాజు, సీపీవో షాలెంరాజు, సర్వశిక్షాభియాన్ అధికారి నాగిరెడ్డి, బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ లవన్న, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి

జీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులు ఆదా చేయవచ్చు అని, జీవన ఎరువులతో పంటకు బలం చేకూరుతుందనే విషయాన్ని వ్యవసాయాధికారులు రైతులకు వివరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జీవన ఎరువులు, నానోయూరియా, నానో డీఏపీ వాడకం ఆవశ్యకతపై ముద్రించిన పోస్టర్‌ను వ్యవసాయాధికారులతో కలిసి కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల సారం పెంపుదల, నిర్మాణం పటిష్టం చేసుకొనుట, ఆరోగ్యకరమైన నేల మనం ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేలలో పోషకాల వృధాను తగ్గించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, ఏడీఏ కె.ధనరాజు, వ్యవసాయాధికారిణి కె.శారద తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లేయులకు సింహస్వప్నం అజాద్

● డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్‌వారి గుండెల్లో నిద్రించి వారికి సింహస్వప్నంగా మారిన చంద్రశేఖర్ అజాద్ చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో బుధవారం అజాద్ 119వ జయంతిని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలిసాయుధ పోరాటయోధుడు ఆయన అన్నారు. న్యాయవాదులు జమ్మద్‌బాషా, టి.భాస్కరరావు, ఆనంద్, షేక్ బాజి, చంద్రబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల విస్తరణా శిక్షణ కేంద్రంలో 26 జిల్లాల నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్‌లకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా గుగూల్ మీట్ ద్వారా ఈజీఎస్ డైరెక్టర్ వైవీ షణ్ముఖ కుమార్, అడిషనల్ కమిషనర్ మల్లెల శివప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎండి.నరేంద్రబాబు, ఏపీవో కె.స్వరూపరాణి, ఈసీ జేవీ సునీల్, గౌరిశంకర్ పాల్గొన్నారు.

కూటమి సుపరిపాలన విజయవంతం : అఫ్జల్

పిట్టలవానిపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు మండలంలోని జిఎన్‌పాలెం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలోని 189, 190 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించారు. టీడీపీ మండలమాజీ అధ్యక్షుడు గోకరాజు శ్రీధర్‌వర్మ స్వగృహానికి అఫ్జల్ వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించి కరపత్రాన్ని అందజేశారు. స్థానిక టీడీపీ నాయకులు పమిడి శ్రీనివాసరావు, పమిడి వెంకటరామయ్య, దబ్బకూటి నాగరాజు, దబ్బకూటి అశోక్,వల్లు గంగరాజు, యర్రాకుల వెంకటేశ్వరరావు, పమిడి శివన్నారాయణ, యేమినేని రాజశేఖర్, నర్రా గోపిరాజు పాల్గొన్నారు.

నాణ్యమైన మద్యం సరఫరాకు చర్యలు

● ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన మద్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఎ4, బార్‌లైసెన్స్‌దారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కల్తీ మద్యం, లిక్కర్, బీర్‌బాటిల్స్ కాలం చెల్లినవి అమ్మితే చట్టరీత్యా నేరమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ పి.గీతిక, ఎస్ఐలు డి.ప్రభుదాసు, ఎస్.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసి దినోత్సవంపై నేడు సమీక్ష

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవంపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమాధికారి ప్రకాశరావు తెలిపారు. స్టూవర్టుపురం గిరిజన బాలుర వసతి గృహంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ ఛార్జీలపై మాటతప్పిన ప్రభుత్వం : సీపీఎం

బాపట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌పై కూటమి ప్రభుత్వం మాటతప్పిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో మా ఇంటికి స్మార్ట్‌మీటర్లు వద్దు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలనే కరపత్రాలను ఆవిష్కరించారు. ముందుగా కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో బాబురావు మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి ప్రజా వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ప్రభుత్వ కార్యాలయం దగ్గర నిరసనలు, ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం కేంద్రకమిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ప్రజలు సమరశీల పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ సభ్యులు మాల్యాద్రి, జిల్లా కార్యదర్శి గంగయ్య, టి.కృష్ణమోహన్, ఎన్.బాబురావు, మణిలాల్, మజుందార్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలి గ్రామం పాతపాలెంలో దేవరంపాటి చంటి మృతి చెందారు. పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహకారంతో గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజా, గేరా ఏసుబాబు, జోగి రాజేష్, షేక్ సుభాని, రత్నం, డి.వెంకటస్వామి, దేవరంపాటి రవీంద్ర మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు.

భట్టిప్రోలు సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయికి కలెక్టర్ జె.వెంకటమురళి షోకాజ్ నోటీసు జారీ చేశారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న మాంజినాయక్ విధులకు ఆటంకం కలిగిస్తున్న సర్పంచ్ భర్త తీరుపై విసుగు చెందిన కార్యదర్శి ఈ నెల 18న ఉన్నతాధికారులకు అర్జీ అందించారు. తన విధులను సక్రమంగా చేసుకోనివ్వకుండా ప్రతి పనికి అడ్డు తగులుతూ అన్ని తన ఆధ్వర్యంలో నేనే చేయాలంటూ మీకేమి సంబంధం లేదని ప్రవర్తించడంతో పాటు సర్పంచ్ ద్వారా లిఖిత పూర్వక పత్రం అందించడంతో సదరు విషయాన్ని ఉన్నతాధికారులకు అర్జీ రూపంలో తెలియజేశారు. దీంతో డీఎల్‌పీవో, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శికి కూడా షోకాజ్ నోటీసు నకలును కలెక్టర్ కార్యాలయ సిబ్బంది అందజేశారు.

అగ్ని బాధితుడికి ఆర్థిక సాయం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన లుక్కా సీతారామయ్య పూరిల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. మండల గౌడ సంఘ అధ్యక్షుడు అనగాని ఏడుకొండలు, గుంటూరు జిల్లా గీత బంధు సేవా ట్రస్ట్ అధ్యక్షుడు వీరంకి రంగారావు సంఘం తరుపున రూ.10 వేలు ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ వాకా శేషుబాబు, మోటూరి పుణ్యశ్రీనివాసరావు, ఎంపీటీసీ వెంకటనారాయణ, బుర్రా సాంబయ్య, సర్పంచ్ రవి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

అమృతలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపూడిలో పేదలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తుమ్మల రామచంద్రరావు 33వ వర్ధంతి, నాగరత్నమ్మ 29వ వర్ధంతిలను పురస్కరించుకుని కుమారుడు శివరామమోహనరావు ఆర్థిక సహకారంతో 300 మంది పేదలకు దుస్తులతోపాటు, ఖర్జూరపండు కేజీ, నారతో తయారు చేసిన చేతిసంచిని వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి చేతుల మీదగా పేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాస్తి పిచ్చిమాంబ, గోగినేని కరుణశ్రీ, కల్కిమూర్తి, దొడ్డపనేని సుధీర్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కాలపరిమితి దాటిన బీరు అమ్మితే చర్యలు : ఎక్సైజ్ సీఐ

వేమూరు జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్‌షాపుల లైసెన్స్‌దారులు కాలపరిమితి దాటిన బీరు బాటిల్స్ అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో షాపు లైసెన్స్‌దారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, బీరు విక్రయించే సమయంలో బాటిల్‌పై కాలపరిమితిని తనిఖీ చేయాల్సి ఉంటుందన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ, వ్యవసాయాధికారుల సమావేశం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ, వ్యవసాయధికారులు సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సీసీ కార్డులు, మ్యూటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని వీఆర్వోలకు సూచించారు. ఏవో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ గడువు 23తో ముగుస్తుందని వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయం చేసుకుని అర్హులైన రైతులు లబ్ది పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఫణి కుమార్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ శివయ్య బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఆర్‌కె జ్యూయలర్స్ యజమాని పడవల వెంకటేశ్వరరావు ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె భర్త ప్రశ్నించడంతో అతనిపై హత్యాయత్నం చేశాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రేపల్లె అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి వెన్నెల తీర్పు వెలువరించారు. ఆరు సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

నగరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నగంజాం కుక్కలవారిపాలేనికి చెందిన కుక్కల నరసింహారెడ్డి(21) మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. తండ్రి ఏడుకొండలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసింహారెడ్డి తన స్నేహితులు పవన్, రామకృష్ణలతో కలిసి సజ్జావారిపాలెంలో ఉన్న ఓ ఇంటిలో ఉంటూ పోస్టల్ ఉద్యోగాల కోసం ప్రిపరేషన్ చేస్తున్నాడు. జూలై 22న రాత్రి పక్కింటి వారితో చెట్టు కొమ్మ విషయంలో నరసింహారెడ్డి స్నేహితులు గొడవపడ్డారు. ఈ సంఘటన నేపథ్యంలో మనస్థాపం చెందిన నరసింహారెడ్డి, స్నేహితులు ఇంట్లో లేని సమయంలో ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



లబ్ధిదారుల కుటుంబానికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు (వేమూరు) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన కూరపాటి గోపి అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించుకున్నారు. ఆర్థిక పరిస్థితి సరిలేదంటూ ప్రభుత్వం ద్వారా సహాయాన్ని కోరుతూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లేఖ రాశారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3.50 లక్షలు మంజూరు చేయించారు. సంబంధించిన చెక్కును బుధవారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో గోపి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గోపి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సోదరుడు-శివప్రసాద్

రైతులకు అందుబాటులో ఉంటూ పని చేయాలి

● అనగాని శివప్రసాద్

రేపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అందుబాటులో ఉంటూ వారికి మేలు జరిగే విధంగా వ్యవసాయశాఖాధికారులు విధులు నిర్వహించాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వ్యవసాయశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా జాయిన్ అయిన ఏవోలు, ఏఈవోలు, వీపీఏలు, ఎంపీఈవోలు, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే యూరియా, డీఏపీ, పొటాష్ వంటివి సక్రమంగా అందించే విధంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, వ్యవసాయశాఖ ఏడీఏ ఎ.లక్ష్మి, ఏవో మహేష్‌బాబు, ఏఈవోలు, వీపీఏలు తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో రహదారుల అభివృద్ధి

పట్టణంలో లోతట్టు ప్రాంతాలపై మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించి రహదారులు, డ్రెయిన్లు కోసం రూ.4 కోట్లు మంజూరు చేయించారని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలో రూ.30 లక్షల నిధులతో పలువార్డుల్లో సీసీ రహదారుల అభివృద్ధికి బుధవారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు టీకేవీ గుప్తా, జీ.ప్రశాంత్, టీడీపీ నాయకులు జీపీ రామారావు, పంతాని సాయికుమార్, ఆలపాటి వేణుగోపాల్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, షేక్ జమీర్, సజ్జాప్రసాద్, మద్దుల అంకాలు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో ఎక్కువగా ఉన్న మత్స్యకారుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు అన్నారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెంలో బుధవారం జరిగిన మత్స్యకారులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తపాలెం జెట్టీవద్ద విద్యుత్ కోసం త్రీఫేస్‌ను ఏర్పాటు చేయాలని, చీరాల ఓడరేవు, ఈపూరుపాలెం సీమౌత్ ఆక్రమణ సమస్య పరిష్కరించాలని కోరారు. వేట నిషేదం భృతి కొత్తపాలెం గ్రామంలో 60 మందికి ఇవ్వాల్సి ఉందన్నారు. వేటనిషేధ భృతి, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న చీరాల ఎన్‌జీవోహోమ్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో మత్స్యకారులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, మత్స్యకారులు సీహెచ్ శ్రీనివాసరావు, వెంకటరమణారావు, ప్రసాద్, చెన్ను ప్రహ్లాదుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు

పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధుల నివారణ

నగరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రపర్చటం ద్వారానే అంటువ్యాధులు అరికట్టవచ్చునని మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన ధూళిపూడిలో బుధవారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ధూళిపూడి ప్రధాన రహదారికి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తేలికపాటి వర్షాలకే నీరు నిలుస్తుందని ప్రజలు తమదృష్టికి తీసుకువచ్చారని దీనిని అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన ప్రజలకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించటమే లక్ష్యం

రేపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రానున్న ఖరీఫ్ సీజన్‌లో సమృద్ధిగా సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ రేపల్లె ప్రాంతానికి రూ.3.50 కోట్లు కాల్వలు, డ్రెయిన్ల అభివృద్ధికి మంజూరు చేయటం జరిగిందని, ప్రధాన పనులన్నీ 80 శాతం పూర్తయ్యాయన్నారు. కాల్వ పూడికతీత, కాల్వ కట్టలు బలపర్చటం, లాకుల మరమ్మతులు, డ్రెయిన్‌ల పూడికతీత, తూటికాడ తొలగింపు వంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

శాకంబరిదేవిగా పార్వతీ అమ్మవారు

కొల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరులోని గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం పార్వతీ అమ్మవారికి స్నపన కార్యక్రమం నిర్వహించి విశేష అలంకారం గావించారు. సాయంత్రం శాకంబరి దేవిగా అలంకరించి ప్రత్యేక హారతులు అందించారు. దేవస్థాన బ్రాహ్మణ సంఘ సభ్యులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

షార్టు సర్క్యూట్‌తో పశువుల చావిడి దగ్ధం

రేపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేటేరు గ్రామంలో వాకా సాంబశివరావుకు చెందిన పశువుల చావిడి షార్టు సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురైందని మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడు నెలల చూడి గేదె కాలి చనిపోయిందని, పాడి గేదె, రెండు సంవత్సరాల పడ్డ దూడకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. పశువులకు అత్యవసర వైద్యసహాయం అందించటం జరిగిందని తెలిపారు.

అద్దంకివారిపాలెంలో 'పొలం పిలుస్తోంది'

నగరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే వ్యవసాయ శాఖ అనుబంధ శాఖ పని చేస్తుందని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకురాలు ఎ.లక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన అద్దంకివారిపాలెం గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో పెదపులివర్రు, సూరేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించి వరి పంట బీమా గురించి రైతులకు వివరించారు. ఏఈవోలు లక్ష్మీప్రసన్న, బుష్, అఖిల, వీహెచ్‌ఎలు, రైతులు పాల్గొన్నారు.



వర్షా కాలం వచ్చిందంటే చాలు తరచూ ఏదో ఒక చోట పిడుగులు పడుతూ ఉంటాయి. వాటి తీవ్రతకు ప్రజలు. మూగ జీవాలు ప్రాణాలు కోల్పోవటం జరుగుతుంటుంది. ఈ ప్రమాదం నుంచి బయట పడటానికి, పిడుగు పాటును ముందుగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సాంకేతికతతో యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఆ యాప్ అపాయాన్ని ముందుగానే గుర్తించి మనల్ని అప్రమత్తం చేస్తుంది.

సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులో ఇటీవల పిడుగు పడి ఇంటి గోడలు పగుళ్ళు ఇచ్చాయి. ఐతే ఇంటిలో వారికి ఎటువంటి ప్రమాదం జరగ లేదు. పిడుగు శబ్దానికి ఆ ఇంట్లోని సామాగ్రి పాడవ్వటంతో పాటు భయాందోళనలకు గురయ్యారు.

పిడుగును పసిగట్టే దామిని

సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి):

పిడుగు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు యాప్‌లో తెలియ జేస్తున్నారు. ఆరు బయట ఉంటే ఇళ్ళల్లోకి వెళ్ళాలి. వర్షం కురుస్తున్న సమయంలో చాలా మంది చెట్ల కిందకు వెళ్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. చెట్టు పిడుగును త్వరగా ఆకర్షిస్తుంది. వర్షం పడేటప్పుడు చెట్టు కిందకు ఎట్టి పరిస్థితుల్లోను వెళ్ళకూడదు. మెరుపులు అధికంగా ఉంటే ఇంటి నుంచి బయటకు వెళ్ళక పోవటం ఉత్తమం. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో ఎలక్ట్రానిక్ వస్తువులు ఉపయోగించకపోవటం మేలని నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

● దామిని యాప్ అందుబాటులోకి..

వాతావరణానికి సంబదించిన వివరాలు తెలుసుకోవటానికి కేంద్ర యర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ ప్రజలకు ఉయోగ పడేలా దామిని యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. దీనిని గుగూల్ ప్లే స్టోర్ ఉంచి డౌన్ లోడు చేసుకొని పేరు, మొబైల్ నెంబరుతో రిజిస్టర్ చేసుకోవాలి. జీపీఎస్ లోకేషన్ తెలుసుకోవటం కోసం యాప్‌కు అనుమతి ఇవ్వాలి. దీంతో మీరు ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో ముందుగానే తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో అన్ని బాషలు అందుబాటులో ఉన్నాయి.

పండుగలు వస్తున్నాయ్..

శ్రావణంలో అనేక పండుగలు వస్తున్నాయి. ఈనెల 25న తొలి శుక్రవారం, 8న వరలక్ష్మి వ్రతం, 9న రాఖీ, జంధ్యాల పౌర్ణమి వేడుకలు, 15న స్వాతంత్రదినోత్సవం, 16న శ్రీ కృ ష్ణాష్టమి వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నాయి. 22న ఐదో శుక్రవారంతో శ్రావణ మాసం ము గుస్తుంది. శ్రావణం పూర్తైన వెంటనే బాద్రపద మాసంలో 27న వినాయక చవితి పండుగ వస్తుంది.



శుభాల.. శ్రావణం

- రేపటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- పండుగలకు 'నెల'వు..
- మహిళలకు ప్రీతిపాత్రం
- వ్యాపారులు, రైతులు, పురోహితుల్లో ఆశలు
- దేవాలయాలూ ముస్తాబు

నెలల వారీగా ముహూర్తాలు

జూలైలో: 26, 30, 31
ఆగస్టు: 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17.
సెప్టెంబరు: 24, 26, 27, 28.
అక్టోబరు: 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31.
నవంబరు: 1, 2, 7, 8, 12, 13, 15. 22, 23, 26, 27, 28, 30

● నవంబరు నెల్లో కూడా ముహూర్తాలు రికార్డు స్థాయిలో ఉన్నాయని అనంతరం. డిసెంబరు 8 నుంచి ఫిబ్రవరి 6 తేది వరకు దాదాపు రెండు నెలలపాటు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

గుంటూరు (తూర్పు), జూలై 23(ఆంధ్రజ్యోతి): మే నెలతో ముహూర్తాలు ముగియడంతో వివాహాలు, శుభకార్యాలకు విరామం వచ్చింది. శ్రావణ మాసం ఆరంభం నుంచి శుభ ముహూర్తాలు ఉండటంతో పట్టణాలతో పాటు పల్లెల్లోనూ కల్యాణ మండపాలను సిద్ధం చేస్తున్నారు. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలకు బలమైన ముహూర్తాలు ఉన్నట్టు వేద పండితులు చెబుతున్నారు. మరో వైపు ఈ మాసం మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైంది. ధార్మిక, ఆధ్యాత్మిక, వ్యాపార ప్రారంభం వంటి శుభకార్యాలతో ముడిపడి ఉంటుంది. వివాహం, గృహ ప్రవేశం, గృహ నిర్మాణం, నామకరణం వంటి అనేక శుభ కార్యాలు నిర్వహించటానికి మంచి నెలగా అందరూ భావిస్తారు. కొత్త దంపతులు ఆషాఢంలో ఎడబాటు కు గురవు తారు. శ్రావణంలో కలుస్తారు.

విష్ణు పూజలకు ప్రత్యేకం..

శ్రావణ మాసం ప్రారంభం కానుండటంతో మహిళలు శ్రావణ లక్ష్మీవ్రతాలను ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. సర్వమంగళ కారిణైన గౌరి, లక్ష్మి, హరిహరులను విశేషంగా అర్చించే నెల కూడా ఇదే. చాంద్రమానం ప్రకారం శ్రావణాన్ని ఐదో నెలగా పరిగణిస్తారు. ఈనెల పౌర్ణమిన చంద్రుడు శ్రవణ నక్షత్ర సమీపంలో సంచరిస్తున్నందున శ్రావణ మాసంఅనే పేరు వచ్చినట్లు పండితులు చెబుతారు. శ్రవణ నక్షత్రం మహావిష్ణువు జన్మ నక్షత్రం కావటంతో విష్ణు పూజలకు ప్రసిద్ధి. ఈ నెలలో వచ్చే మంగళ, శుక్ర, శనివారాలను అత్యంత పుణ్యప్రదమైనవిగా భావిస్తారు. మంగళవారం గౌరీ పూజలు, శుక్రవారాల్లో లక్ష్మీపూజలు, శనివారాల్లో విష్ణు పూజలు చేస్తారు. వైష్ణవారాధనతో పాటు మహా శివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు.

వ్యాపారుల్లో ఆశలు...

ముఖ్యంగా ఈనెల 31న పెద్ద ముహూర్తం కావడంతో పెళ్లిళ్ల పెద్ద సంఖ్యలో జరగనున్నాయి. దీంతో అయా వ్యాపారులు, పురోహితులు ఈ ముహూర్తంపై ఆశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో శ్రావణ మాసంపై రైతులు పెద్ద ఆశలే పెట్టుకున్నారు. ముఖ్యంగా ధరలేక నష్టపోతున్న మిర్చి, పొగాకు రైతులు ఈ నెలలో నైనా ధర పెరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.



● శ్రావణ మాసం ప్రత్యేకమైంది...

శ్రావణమాసం అంటే ఎంతో పవిత్రమైనదిగా, ప్రధానమైనదిగా భావిస్తారు. జ్ఞానసిద్ధిని అందించే మాసంగా పురాణాల్లో పేర్కొన్నారు. వైష్ణవా రాధనతో పాటు మహా శివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు శ్రావణమాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.


మాధవస్వామి

గుంటూరు బృందావన్‌గార్డెన్స్.వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు


● పెసర్లంక వద్ద వరద ఉధృతికి కోతకు గురవుతున్న పంట పొలాలు

నదీపాతంలో పొలాలు

- భూమి కోతలతో రైతులకు గుండెకోత
- తీర పొలాల రక్షణకు గ్రాయిన్స్ ఏర్పాటు చేయాలని వినతి

కొల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఉధృతికి తీర ప్రాంత పొలాలు నదీపాతంలో కలిసిపోతున్నాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో చిలుమూరు నుంచి రావిఅనంతవరం వరకు సుమారు 30 కి.మీ పైగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో వందలాది ఎకరాల పంట భూములు వరదల వల్ల కోతకు గురవుతున్నాయి. గత సంవత్సరం కృష్ణానదికి వచ్చిన భారీ వరదకు అంచున ఉన్న భూములు నదిలో కలిసిపోయాయి. 30 ఏళ్ల క్రితం కొల్లూరు మండలంలో పోతార్లంక, తిప్పలకట్ట గ్రామాల మధ్యలో భూమి కోతలు నివారించేందుకు గ్రాయిన్స్(గోడలు) నిర్మించి నదీ ప్రవాహాన్ని దారి మళ్లించడంతో కొంత మేరకు కోతలు తగ్గాయి. కొన్నేళ్ల నుంచి భట్టిప్రోలు మండలం ఓలేరు, కొల్లూరు మండలంలోని పెసర్లంక, పోతార్లంక, తిప్పలకట్ట గ్రామాల పరిధిలో భూమి కోతకు గురవుతోంది. వరద ప్రవాహం పెరిగేటప్పుడు తగ్గేటప్పుడు భూమి కోతలు ఎక్కువగా ఉంటున్నాయి. భూమి ఎక్కువగా కోతకు గురయ్యే ప్రాంతాల్లో నది పరివాహక శాఖాధికారులు గుర్తించి గ్రాయిన్స్ ఏర్పాటు చేస్తే ప్రవాహం దిశ మారుతుందని రైతులు చెప్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రాయిన్స్ ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ సీట్ల జాబితా విడుదల

- 26 లోపు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా ఇంజనీరింగ్ సీట్లు

గుంటూరు (విద్య) జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ఆప్షన్ పెట్టుకున్న విద్యార్థిని విద్యార్థులకు సీట్లు కేటాయిస్తూ సాంకేతిక విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థిని ,విద్యార్థులు నిర్దేశించిన తేదీల్లో సీట్లు కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాలని సాంకేతిక విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

సీట్లు కేటాయింపు తెలుసుకునేది ఇలా..

విద్యార్థిని విద్యార్థులు తమకు ఏ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వచ్చింది అనే విషయాలు తెలుసుకునేందుకు వెబ్సైట్ లో చూడాలి . ఏపీ ఈఏపీ సెట్ హోం పేజీలో ఫారమ్స్ అనే బాక్స్ లో డౌన్లోడ్ అలాట్మెంట్ ఆర్డర్ పై క్లిక్ చేస్తే వివరాలు తెలుస్తాయి. అక్కడ హాల్ టికెట్ నంబర్ పుట్టిన తేదీ వివరాలు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది దానిని ఎంటర్ చేసిన వెంటనే అలాట్మెంట్ ఆర్డర్ సెల్ఫ్ రిపోర్టింగ్ ,వెబ్ ఆప్షన్ రిపోర్టింగ్ డిస్ప్లే అవుతాయి. ఇక్కడ ఏ కళాశాలలో సీటు వచ్చిందో దానికి సంబంధించిన అలాట్మెంట్ ఆర్డర్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చినని సాంకేతిక విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వెరిఫికేషన్‌కు అవసరమైన పత్రాలు ఇవే..

ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు వచ్చిన విద్యార్థిని విద్యార్థులు ఈనెల 26న రిపోర్ట్ చేయాలి. ఈ నేపథ్యంలో విద్యార్థులు కళాశాలకు వెళ్లే సమయంలో ఆన్లైన్ కౌన్సెలింగ్ స్లిప్పు , ఏపీ ఏపీ సెట్ ర్యాంక్ కార్డ్, అడ్మిట్ కార్డ్, పదవ తరగతి సర్టిఫికెట్, ఇంటర్ మార్కుల జాబితా, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్ ,ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, కుల, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్ కాపీల సెట్లు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. జిరాక్స్ కాపీలను కళాశాలలో అందజేసి రిపోర్ట్ చేయాలి. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని సాంకేతిక విద్యాశాఖ వెల్లడించింది.



జిల్లాలో పరిస్థితి ఏమిటి

ఉమ్మడి జిల్లాలో రెండు యూనివర్సిటీ కాలేజీ లతోపాటు మరో 36 పైగా ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో దాదాపు 30వేలకు పైగా సీట్లు ఉన్నాయి. అయితే అయితే ఏపీ ఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల విద్యార్థులు 25 వేల మంది వరకు ఉన్నారు.

మిర్చి.. మోత

కిలో రూ. 100, టమోటా రూ. 60



గుంటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో పచ్చి మిర్చి ధర చెటి తేనే ఘాటెక్కుతోంది. మరో వైపు టమోటా ధరలు కూడా మోత మోగుతున్నాయి. టమోటా కిలో రూ. 60కు చేరుకుంది. ఇటీవల వర్షాలు విస్తారంగా కురవటం, డిమాండ్‌కు అనుగుణంగా పంట ఉత్పత్తులు లేకపోవటంతో టమోటా, మిర్చి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. పచ్చి మిర్చి గత రెండు వారాల కింద రూ. 50 నుంచి రూ. 60ల నుంచి ఎగబాకుతూ ప్రస్తుతం రూ. 100లకు చేరుకుంది. గత వారంలో టమోటా కిలో రూ. 40లు ఉండగా రోజురోజుకు పెరుగుతూ తాజాగా కిలో రూ. 60లకు చేరింది. సోమ, మంగళవారాలు కూడా టమోటా కిలో రూ. 40లు, రూ. 50లకు విక్రయించగా ఒక్క రోజులోనే కిలోకు రూ.10లకు పెరిగింది. ఇక బెండ, దొండ, గోరు చిక్కుడు, వంకాయ వంటి కూరగాయలు కిలో రూ. 40 నుంచి రూ. 50ల వరకు విక్రయిస్తున్నారు.

దివ్యాంగులకు వాహనయోగం

- ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం
- తొలిదశలో నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ
- త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు(తూర్పు), జూలై 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇంధన రాయితీ, శాశ్వత గుర్తింపు కార్డులు అందజేసిన కూటమి ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. వారికి నూరు శాతం రాయితీతో త్రిచక్ర వాహనాలు (రెట్రోఫిటెడ్ వాహనాలు) అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ త్వరలోనే ప్రారంభమవుతుందని అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితాను తయారు చేసి వీలైనంత వేగంగా వాహనాలు అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. గతంలోనే 50 శాతం ఇందన రాయితీ కల్పించిన ప్రభుత్వం మరోసారి రూ లక్ష విలువ కలిగిన వాహనాలను అందజేయడంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ వాహనాలు అందజేసింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల కాలంలో ఒక్కసారే పంపిణీ చేశారు.

● ఆనందంగా ఉంది..



ఎన్నికల హామీలో భాగంగా పెన్షన్ పెంచడం, ఆ తరువాత ఇందన రాయితీ, ఇప్పుడు లక్ష రూపాయిలు విలువ చేసే వాహనాలను అందించడం ఆనందంగా ఉంది. ఇటువంటి కార్యక్రమాలతో దివ్యాంగులకు స్వయం ఉపాధిని కొనసాగించడానికి, వారికి జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు శక్తి నిస్తుంది. ప్రభుత్వం స్పందించి అధికారంలోకి రాగానే ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరించడం అభినందనీయం. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి వాహనం అందించేలా కార్యచరణ రూపొందించాలి.

వెలుగు శివప్రసాదు, విభిన్న ప్రతిభా వంతుల ఆదరణ సేవ సమితి అధ్యక్షుడు

● సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం తీసుకు వస్తున్న ఈ కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వియోగం చేసుకోవాలి. దీనికి సంబంధించిన నిధులును ప్రభుత్వం కేటాయించింది. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తాం. కావాల్సిన పత్రాలు ఇతర వివరాలను అందజేసేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచాం. ప్రభుత్వ ఆదేశాలు అందగానే దరఖాస్తులు స్వీకరించి, ప్రభుత్వానికి పంపుతాం. అర్హుల జాబితాను ఎంపికచేసి, వీలైనంత త్వరలోనే వాహనాలను పంపిణీ చేస్తాం.

దుర్గాబాయి, ఇన్‌చార్జి ఏడీ వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ జిల్లా శాఖ.



అర్హులు ఎవరంటే..

త్రిచక్ర వాహనాల పంపిణీకి దివ్యాంగుల అర్హతలను ఇప్పటికే ప్రభుత్వం నిర్ధారించింది. డిగ్రీ, ఆపై ఉన్నతవిద్య అభ్యసించే విద్యార్థులకు, స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారికి తొలి ప్రాధాన్యమిస్తారు. 18-45 ఏళ్ల మధ్య ఉన్న 70 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు దీనికి అర్హులు. వార్షికాదాయం రూ. 3లక్షల లోపు ఉండాలి.

కావాల్సిన పత్రాలు

దరఖాస్తుతో పాటు వైకల్యం 70శాతం నిర్ధారించే సదరన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పదవ తరగతి సర్టిఫికెట్, బ్యాంకు వివరాలు, ఆధార్, రేషన్ కార్డులు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్టు ధృవీకరణ పత్రంతో అయా జిల్లాలోని వయోవృద్ధులు, హిజ్రాల, దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలి.

● నియోజకవర్గానికి పది వాహనాలు

తొలిదశలో నియోజకవర్గానికి 10 చొప్పున వాహనాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని ప్రతి ఏడాది నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుంది. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరి కొంత మందికి వీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో ప్రతి లబ్ధిదారునికి వాహనం అందుతుందని అధికారులు చెబుతున్నారు.

సబ్ డివిజన్ సర్వీసులకు ఫీజు రాయితీ

డిసెంబరు 12 వరకు పొడిగించిన ప్రభుత్వం

గుంటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌ల ఆన్‌లైన్ సబ్ డివిజన్ సర్వీసుల కోసం అందిన దరఖాస్తులకు వన్‌టైం ఫీజు రాయితీని ప్రభుత్వం మరికొన్ని నెలలు పొడిగించింది. ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన వన్‌టైం ఫీజు రాయితీని ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. అయితే ఇంకా చాలామంది ఈ రాయితీని వినియోగించుకొనేందుకు అభ్యర్ధనలు పెట్టుకోవడంతో గడువు తేదీని పొడిగిస్తూ సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జీ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

భూముల రీసర్వేలో భాగంగా గత ప్రభుత్వం ఎల్‌పీఎంలను తీసుకొచ్చింది. వీటి వలన భూముల సర్వే నంబర్లు కనుమరుగై వాటి స్థానంలో ఎల్‌పీఎంలు వచ్చాయి. వీటి ఆధారంగానే రిజిస్ట్రేషన్లు కూడా చేస్తున్నారు. అయితే జాయింట్ ఎల్‌పీఎంల వలనే అనేక భూవివాదాలు నెలకొన్నాయి. వాటిని సింగిల్ ఎల్‌పీఎంలుగా చేయాలని రైతుల నుంచి రెవెన్యూ సదస్సుల సందర్భంగా వేల సంఖ్యలో అభ్యర్ధనలు వచ్చాయి. గుంటూరు జిల్లాలో 3036, పల్నాడు జిల్లాలో 3378, బాపట్ల జిల్లాలో 4253 అర్జీలు వచ్చాయి. వీటిల్లో ఎక్కువగా జాయింట్ ఎల్‌పీఎంలవే ఉన్నాయి. తమకు ఉచితంగా సింగిల్ ఎల్‌పీఎం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని అభ్యర్థించగా అందుకు ఆమోదం తెలిపి, ఆరు నెలల పాటు ఉచితంగా అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు రూ. 550 ఫీజు నిర్ణయించడంతో రైతులు ఇబ్బంది పడగా ప్రభుత్వం దానిని వన్‌టైం రాయితీ కింద మినహాయించింది. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలపై స్వీకరించిన దరఖాస్తులను పూర్తి పరిశీలన చేసి ఆన్‌లైన్ సబ్‌డివిజన్‌ని ఉచితంగా చేస్తున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన తొలి ఆరు నెలల గడువు ఆయా ఆన్‌లైన్ దరఖాస్తుల పరిష్కారానికి సరిపోకపోవడంతో రైతుల విజ్ఞప్తి మేరకు మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు త్వరితగతిన ఆన్‌లైన్ సబ్ డివిజన్‌కు సంబంధించిన జాయింట్ ఎల్‌పీఎం అర్జీలను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి పర్యటన

సంతమాగులూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బాలబాలికలకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు. ఆ తర్వాత మక్కెనవారిపాలెంలో ఉదయం 10:30 గంటలకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారని ఆయన కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

నేడు మారుతీ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

ఇంకొల్లు, జూలై 23, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మారుతీ ఐటీఐ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నారని పేర్కొన్నారు. 300లకు పైగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. 18-30 ఏళ్ల మధ్య వయస్సు కలిగి పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ విద్యార్హత కలిగిన వారికి జీతం రూ.12,000 నుంచి రూ.20,000 వరకు ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 6302764962, 9988853335 నంబర్లలో సంప్రదించాలని ఐటీఐ కాలేజి ప్రిన్సిపల్ కారుమూడి శ్రీనివాసరావు కోరారు.

అంతర్ పంటల సాగు చేపట్టాలి

బల్లికురవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో అంతర్ పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం మండలంలోని కొప్పెరపాలెం, వేమవరం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పొగాకు పంటను సాగు చేయవద్దు అని, పప్పు ధాన్యాలను సాగు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మౌలాలి పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త నర్రా వెంకట్‌కు సతీవియోగం

పర్చూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నర్రా వెంకట్ సతీమణి లక్ష్మీసుధ(44) బుధవారం మృతి చెందారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు, గ్రామంలో ఏర్పాటు చేసిన పలు ఆలయ నిర్మాణాలతోపాటు, గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందించి దాతృత్వం చాటుకున్నారు. స్థానిక శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎంతగానో సహకారం అందించారు. మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు.

ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

నర్రా లక్ష్మీసుధ హఠాన్మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిలో నర్రా కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిదని, లక్ష్మీ సుధ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని తెలిపారు.

ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు విద్య, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను, మిగులుగా తేలిన టీచర్లను ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 16 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో 48మంది టీచర్లు ఖాళీగా ఉన్నారన్నారు. జీవోనెంబరు 1 ప్రకారం తగినంత మంది విద్యార్థులు లేని కారణంగా 120 మంది టీచర్లు మిగులుగా తేలారు. వీరందరికి కౌన్సెలింగ్ నిర్వహించి శాశ్విత ప్రాతిపదికన పాఠశాల్లో నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న అన్ని రకాల రాయితీలు, సౌలభ్యం, వసతులు ఎయిడెడ్ విద్యార్థులకు కూడా కల్పించాలని, ఎయిడెడ్ పాఠశాలల నిర్వహణకు సమగ్ర శిక్ష నిధులు ఇవ్వాలనిడిమాండ్ చేశారు.

మల్లవరం వేంకటేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డ్ నియామకం

మద్దిపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా మార్నేని రాఘవేంద్రరావు, సభ్యులుగా మార్నేని కృష్ణారావు, సింగరాజు అరుణ, గాలి వెంకటరాంబాబు, గుళ్లాపల్లి శ్రీనివాస రావు, మర్రిపూడి పద్మావతి, డొక్కా రమాదేవి, ఏల్చూరి శేషయ్యలను నియమిస్తూ బుధవారం ఎండోమెంట్ కమిషనర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పక్కన ఎంఎల్ నారాయణ



మహాసభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

అద్దంకిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్‌వాళ్ల దుర్మార్గాలకు, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడింది రెండు పార్టీలని, అందులో ఒకటి కాంగ్రెస్, రెండోది కమ్యూనిస్టు పార్టీయేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ కె.రామకృష్ణ చెప్పారు. అప్పటినుంచి ప్రజల సమస్యల కోసం, కార్మికుల డిమాండ్‌ల సాధన కోసం, రైతుల కోసం పోరాడుతున్న పార్టీ సీపీఐ అని తెలిపారు. బుధవారం అద్దంకిలోని బంగ్లారోడ్డులో సీపీఐ బాపట్ల జిల్లా రెండో మహాసభ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అధ్యక్షతన జరిగింది. ముందుగా స్థానిక భూపేష్ భవనం నుంచి బంగ్లా రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల ఫలితంగా పేదలు పేదవాడిగానే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వలన ఒరిగిందేమీ లేదు
వైసీపీ హయాంలో పరిపాలనను పూర్తిగా గాలికొదిలేసిన జగన్
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
అద్దంకిలో ఘనంగా ఆ పార్టీ జిల్లా రెండో మహాసభలు

ఉంటున్నారన్నారు. భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులు అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. మత ప్రాతిపదికన ప్రజల్లో చీలిక తేవడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీలేదని చెప్పారు. నాడు అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని పూర్తిగా గాలికొదిలేసి కేవలం పోలీస్ రాజ్యాంగాన్ని నడిపాడని విమర్శించారు. 150 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే ఆయన కోటలో కూర్చొని సచివాలయానికి కూడా రాలేదన్నారు. ఆయన ఆఫీసుకు రాడు, మనలాంటి వాళ్లు ఎవ్వరైనా వెళ్లి సమస్యలు చెప్పుకుందామంటే ఇంటికి రానివ్వడని చెప్పారు. ప్రజా సమస్యలపై ధర్నా చేస్తామంటే పొద్దునే పోలీసోళ్లను పంపి హౌస్ అరెస్టులు చేయించిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. జనమంతా అమాయకులని, వాళ్లకేమీ తెలియదని, వారికి ఇంతింత డబ్బులు అకౌంట్‌లో పడవేస్తే మళ్లీ తనకే ఓట్లు వేస్తారని దెబ్బతిన్నాడని చెప్పారు. ప్రజలు మహా తెలివైనోళ్లని, ఎన్నికల వరకు ఏమి మాట్లాడకుండా ఎన్నికలలో 11 సీట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో ఒక రోడ్డు వేయలేదు, కాలువ తవ్వలేదు, ఒక ప్రాజెక్టు కట్టలేదు, ఒక ఫ్యాక్టరీ పెట్టకుండా ఏమి చేయకుండా నేను బటన్ నొక్కుతాను, మీరు నాకు బటన్ నొక్కండనే తీరులో వ్యవహరించాడన్నారు. చాలా ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వలేదని చెప్పారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక గీతామందిర్‌లో ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జిల్లాలోని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో ప్రజలకు భరోసా

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత వైసీపీ ప్రభుత్వంలా మాయ మాటలు చెప్పడం లేదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి ప్రజలకు ఉత్తమ భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మున్సిపాలిటీలో 31వ వార్డు, మండల పరిధిలో ఈపూరుపాలెంలో నిర్వహించారు. ముందుగా వార్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి నుంచి అర్జీలు స్వీకరించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

సీతారామాలయం ధర్మకర్తగా రామసుబ్బారావు

చినగంజాం, జూలై 23(ఆంధ్రజ్యోతి) :చినగంజాం గ్రామానికి చెందిన మోటుమర్రి రామసుబ్బారావు స్థానిక పురాతన సీతారామాలయ దేవస్థాన ధర్మకర్తగా నియమితులయ్యారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా రామసుబ్బారావుకు నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామసుబ్బారావు మాట్లాడుతూ తన నియామక పత్రంతోపాటు ఆలయ పునర్ నిర్మాణానికి దేవదాయ శాఖ ద్వారా రెండు కోట్ల రూపాయిల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి అందజేసినట్లు తెలిపారు. ఆ నిధులకు 33శాతం మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద రూ.66,67,000 ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చెల్లిస్తే దేవదాయశాఖ వారు సీజీఎఫ్ ద్వారా రూ.1,33,33,000 మంజూరు చేస్తారని చెప్పారు. ఆలయ పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పొద వీరయ్య, కొండ్రగుంట శ్రీహరి, వడ్లమూడి సత్యనారాయణ, గోగినేని మురళీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు వలివేటి వెంకట రామానుజం పాల్గొన్నారు.



రామసుబ్బారావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

25న పర్చూరు మండలంలో మంత్రి పయ్యావుల పర్యటన

పర్చూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 25వ తేదీన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించనున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పర్చూరు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలో పాల్గొంటారు. అనంతరం బొమ్మల సెంటర్ నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. పర్చూరు నెహ్రూకాలనీలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభి, నాగులపాలెంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మాణం చేసిన డ్రెయిన్‌తోపాటు, సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. 12 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రూ.4 కోట్లతో స్రీనిధి బ్యాంక్ లింకేజ్ రుణాలను అందజేస్తారు. దీనికి సంబంధించి బుధవారం నాయకులు కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, మండలపార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, కొల్లా శ్రీనివాసరావు, కొల్లా శివరాంప్రసాద్, పోట్రు శోభన్, షేక్ హుస్సేన్, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, పార్టీ శ్రేణులు

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలుగా బాక్స్ స్ట్రక్చర్‌ను నిర్మించాలి

ఎన్‌హెచ్ఏఐ పీడీ అనిల్‌కుమార్ రెడ్డికి తేల్చి చెప్పిన మూడు గ్రామాల రైతులు

అద్దంకి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలుగా బెంగళూరు హైవేలో పాత కొటికలపూడి సమీపంలో బాక్స్ స్ట్రక్చర్‌ను వెడల్పుగా నిర్మించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) ప్రాజెక్ట్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డికి మూడు గ్రామాల రైతులు తేల్చిచెప్పారు. విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ క్రమంలో అద్దంకి మండలంలోని పాతకొటికలపూడి వద్ద 12 అడుగుల వెడల్పుతో బాక్స్ స్ట్రక్చర్ నిర్మాణం పనులు చేస్తున్న నేపథ్యంలో దానిని 20 అడుగుల వెడల్పు చేయాలని 10 రోజుల క్రితం కొత్త కొటికలపూడి, పార్వతీపురం, వేణుగోపాలపురం రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఎన్‌హెచ్ఏఐ పీడీ అనిల్‌కుమార్ రెడ్డి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. 20 అడుగుల కంటే తక్కువ వెడల్పుతో నిర్మాణం చేస్తే వరిగడ్డి ట్రాక్టర్లు, సుబాబుల్ కర్ర ట్రాక్టర్లు రాకపోకలకు సాధ్యం కాదని సర్పంచ్ పూనాటి విక్రమ్, మూడు గ్రామాల రైతులు ఆయనకు వివరించారు. ఉన్నత స్థాయిలో చర్చించి రెండు రోజులలో నిర్ణయం తెలియజేస్తామని పీడీ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. మరో డొంక వద్ద అదనంగా బాక్స్ స్ట్రక్చర్ నిర్మాణం చేయాలని రైతులు కోరగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఏజీఎం సుబ్బానాయుడు, మేనేజర్ అంకమ్మరావు, స్ట్రక్చర్స్ మేనేజర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పీడీతో మాట్లాడుతున్న సర్పంచ్ పూనాటి విక్రమ్, రైతులు

నాగులచెరువులో చచ్చిన చేపలతో నీరు కలుషితం

ఇంకొల్లు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నాగులచెరువులోని తాగు నీరు కలుషితమవుతున్నాయి. ఇటీవల సాగర్ జలాలతో చెరువును పూర్తిస్థాయిలో నింపారు. వారం రోజులుగా చెరువులో ఉన్న చేపలు చనిపోయి తేలియాడుతున్నాయి. దీంతో నీరు దుర్వాసన వస్తోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేపట్టాలని కోరుతున్నారు. పంచాయితీ సెక్రటరీ వెంకటేశ్వర్లు స్పందించి తేలియాడుతున్న చేపలను తొలగించే పనిలో ఉన్నారు. నీటిని ల్యాబ్ టెస్టింగుకు పంపినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిలో గవ్వల సున్నం కలిపి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అవీఇవీ

పంట మార్పిడి విధానం పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో పంట మార్పిడి విధానం పాటించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట విత్తన సాగు చేపట్టి పూతదశలో భూమిలో కలియదున్నాలని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. పొగాకు సాగు చేపట్టవద్దని, ప్రత్యామ్నాయ పంటలుగా జొన్న, మొక్కజొన్న, పప్పుధాన్యాలు సాగుచేయాలని కోరారు. వ్యవసాయ సహాయకులు శాతరాజుపల్లి హరి, బీబీ జాన్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలి

ఇంకొల్లు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయంగా నీటి వసతి ఉన్న పొలాల్లో మొక్కజొన్న, నీటి సౌకర్యం లేని పొలాల్లో జొన్న పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి మీరమ్మ సూచించారు. మండలంలోని ఇడుపులపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. 2025-26లో రబీలో పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. శనగలో వచ్చే ఎండుతెగులుపై రైతులకు అవగాహన కలిగించారు.

మద్యం కల్తీ చేస్తే కఠిన చర్యలు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



లైసెన్స్‌దారులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాలసీని అనుసరించి మాత్రమే మద్యం విక్రయాలు జరపాలని, కల్తీకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో లైసెన్స్‌దారులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఆదేశాల మేరకు ప్రభుత్వానికి లైసెన్స్ రుసుం చెల్లించని దుకాణాలకు ఇప్పటికే నోటీసులు అందించామని చెప్పారు. సకాలంలో చెల్లింపులు జరగని దుకాణాలపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మామూళ్లతో.. మాయ

(5వ పేజీ తరువాయి)

మానస సరోవరాన్ని కూడా పలువురికి రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. కలెక్టర్ జోక్యంతో సదరు దస్తావేజులు రద్దు చేసినట్లు తెలిసింది. పిడుగురాళ్ల, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో కొన్ని వందల నకిలీ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలులో జరిగిన నకిలీ చలానాల కుంభకోణంలో కూడా ఆయన పాత్ర ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని తప్పులు చేసినా కొందరు అధికారులు ఆయనను వెనకేసుకు రావడం వల్ల ఇటువంటి వ్యవహారాలు పదే పదే జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గుంటూరులోని గోరంట్లలో రూ.40 కోట్ల ఆస్తి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఇదే జాయింట్ రిజిస్ట్రార్ భారీగా నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ సీనియర్ అసిస్టెంట్‌తోనే 18 జీపీఏ చేయించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పల్నాడులో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆ సీనియర్ అసిస్టెంట్‌పై కూడా కేసు నమోదు చేయాలని బాధితులు పోలీసులను కోరినట్లు తెలుస్తుంది. ఇప్పటికే నల్లపాడు పోలీసులు నరసరావుపేటలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జాయింట్ రిజిస్ట్రార్, గుంటూరుకు చెందిన మరో రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేశారు.

నకిలీ మనిషిని తెచ్చినా ఓకే..

వాస్తవానికి రూ.40 కోట్ల ఆస్థికి సంబంధించిన అసలు వ్యక్తి కొత్తపల్లి పద్మజ మృతి చెందారు. ఆమె ఆధార్ కార్డు ఆధారంగానే ఆస్థి బదలాయింపు జరగాలి. రిజిస్ట్రేషన్ సమయంలో అసలు యజమాని వేలిముద్రలు కూడా సరిపోలాలి. మామూళ్ల మత్తులో ఉన్న నరసరావుపేట విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ అన్నిటినీ తేలికగా మార్చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరించి అసలు ఆస్థి పరులను వివాదంలోకి నెట్టారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు కొరిటపాడులో అనుమతి ఇచ్చారని సమాచారం.

డీఐజీ జోక్యంతో..

రూ.40 కోట్ల ఆస్థికి నకిలీ రిజిస్ట్రేషన్‌పై బాధితుడు కొత్తపల్లి శ్రీనివాసరావు అప్పట్లో నరసరావుపేట వెళ్లి అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదు. దీంతో బాధితుడు స్టాంప్స్ రిజిస్ట్రేషన్ గుంటూరు డీఐజీకి ఫిర్యాదు చేయడంతో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్ హడావిడిగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పట్లో నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు చేశారు.

మట్టి పరీక్షలు.. 38.72 శాతమే

(5వ పేజీ తరువాయి)

సాగు పరిస్థితి తారుమారవుతోంది. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలు మొక్కుబడిగా సాగుతుండటంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు, బాపట్ల కంటే పల్నాడులో పర్వాలేదు..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు చేసే సామర్థ్యం మాత్రమే ల్యాబ్‌కు ఉంది. జిల్లాలో 23,437 మట్టి నమునాల పరీక్షల లక్ష్యం కాగా 23,191 మట్టి నమూనాలను సేకరించారు. 12,005 నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల కంటే పల్నాడు జిల్లాలోనే పరీక్షల నిర్వహణ మెరుగ్గా ఉంది. బాపట్ల జిల్లాలో లక్ష్యం మేర 22,688 సేకరించి 7785 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 13,862 సేకరించగా 3494 పరీక్షలు పూర్తయ్యాయి. పరీక్షలు ఇలా జరిగితే ఏడాది చివరికి కూడా పూర్తికావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సూక్ష్మపోషకాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మట్టి పరీక్షలు తేలకపోవడంతో ఆయా సూక్ష్మపోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది. సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా సూక్ష్మపోషకాలను ప్రభుత్వం పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో భూసార పరీక్షలు ఇప్పటికైనా వేగవంతం చేయాల్సి ఉంది.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

మేదరమెట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణాలు తీసుకున్నా వారి నుంచి నెలవారీ కంతులు సక్రమంగా చెల్లించాల్సిన బాధ్యత వీవోఏల మీద ఉందని డీజీఎం ధర్మేంద్ర చెప్పారు. బుధవారం కొరిశపాడులోని వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏల సమావేశంలో ధర్మేంద్ర మాట్లాడుతూ రుణాలను తీసుకున్న వారు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, ఏపీఎం మణిక్యరావు పాల్గొన్నారు.

మురుగు విలయతాండవం..
దోమలు స్వైరవిహారం...!

ఇళ్లను సైతం చుట్టుముడుతున్న వ్యర్థ జలాలు
దండుబాట రోడ్డు అధ్వానంతో ప్రజలు బెంబేలు
కన్నెత్తి చూడని అధికారులు
రోగాలతో విలవిల్లాడుతున్న ప్రజలు

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపాలిటీ పరిధిలోని 26వ వార్డు.. ప్రకాష్‌నగర్ దండుబాట రోడ్డులో వ్యర్థ జలాలు, మురుగు నిల్వలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. జనావాసాల్లో మురుగు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. పందులు పేట్రేగిపోతున్నాయి. ఈక్రమంలోనే డెంగ్యూ కూడా ప్రబలుతోంది. గతంలో ఇదే ప్రాంతంలో డెంగ్యూ జ్వరం సోకి 13 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. తాజాగా మళ్లీ ఇటీవల కురిసిన వర్షాలు, మురుగు నీరు ఏకమై బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి.


విష సర్పాలకు ఆవాసాలుగా చిల్లచెట్లు, మురుగు నీరు


ఇళ్ల మధ్యలోకి చేరిన మురుగు నీటిలో మహిళల అవస్థలు

ఇళ్ల చుట్టూ మురుగు నీరుతో అవస్థలు


సుధీర్, స్థానికుడు

మా ప్రాంతంలో డెంగ్యూ కారణంగా గతంలో మా బంధువు 13ఏళ్ల బాలుడు మృత్యువాతపడ్డాడు. ఇప్పుడు ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరి చాలా ఇబ్బందులు పడుతున్నాం. దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రి వేళల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇటువైపు రావడం లేదు. మా పరిస్థితి పట్టించుకున్న నాధుడు లేడు

రోగాలు ప్రబలుతున్నాయి


రమేష్, స్థానికుడు

ఇళ్లల్లోకి సైతం మురుగు నీరు చేరింది. మురుగుతో అవస్థలు పడుతున్నాము. ఈ మురుగులో పెరుగుతున్న చిల్ల చెట్లతోపాటు విషసర్పాలు సంచరిస్తున్నాయి. అధికారులు శానిటేషన్, ఆయిల్ బాల్స్ చేయాలి. కొంతకాలంగా ఎక్కువమంది డెంగ్యూ బారిన పడ్డారు. అధికారులు మా సమస్యలను పరిష్కరించాలి.

మంత్రి ఆదేశాలతో తీరిన మంచి నీటి సమస్య

బల్లికురవ ఎస్సీ కాలనీలో
రూ. 3 లక్షలతో మినీ వాటర్ ట్యాంకు ఏర్పాటు
హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

బల్లికురవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఎళ్ల నుంచి మంచి నీటి సమస్యతో విలవిలలాడుతున్న బల్లికురవ ఎస్సీ కాలనీవాసులకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఇటీవల బల్లికురవ ఎస్సీ కాలనికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి రవికుమార్ వచ్చారు. కాలనీ వాసులు తమకు తాగునీరు అందటం లేదని తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. వెంటనే మంత్రి రక్షిత పథకం ద్వారా వచ్చే పైప్ లైన్ నీటితో మినీ ట్యాంకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఎంపీడీవో కుసుమకుమారి మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలు మంజురు చేశారు. అదే కాలనీకి చెందిన టీడీపీ నేత కత్తి బుల్లిఅంజయ్య మీని వాటర్ ట్యాంకు పనులను శరవేగంగా పూర్తి చేయించారు. అంబడిపూడి రక్షిత నీటి పథకం ద్వారా వచ్చే మెయిన్ పైప్‌లైన్ నుంచి బల్లికురవ ఎస్సీ కాలనీకి పైప్ లను ఏర్పాటు చేసి 5 వేల లీటర్ల వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నూతనంగా ఏర్పాటు చేసిన తాగు నీటి మినీ ట్యాంకు

సామాజిక తనిఖీలో వెలుగు చూస్తున్న అక్రమాలు

గత ఏడాది కాలంలో చేపట్టిన
రూ.12 కోట్ల ఉపాధి పనులపై
జరుగుతున్న సామాజిక తనిఖీలు
అక్రమాలకు పాల్పడిన
అధికారులలో ఆందోళన

బల్లికురవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో గత ఏడాది కాలంలో జరిగిన పలు రకాల పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు జరుగుతున్నాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు చేపట్టిన 645 పనులకు సంబందించిన రూ.12 కోట్ల నిధుల వినియోగంపై ఎస్ఆర్‌పీ తులసీనాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టాయి. తనిఖీ బృందాలు పని ప్రదేశాలే కాకుండా ఇంటింటికీ తిరిగి కూలీలను సైతం విచారిస్తున్నాయి. ఇప్పటి వరకు కొత్తూరు, గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో తనిఖీలు చేసి గ్రామసభలు పూర్తి కాగా సుమారు రూ.38 లక్షల మేర పనులలో అక్రమాలు ఉన్నట్లు గ్రామసభల ద్వారా తనిఖీ బృందాలు వెల్లడించాయి. అలానే పలు చోట్ల ఒకే ఫొటోలను తీసి కూలీలు పనులకు వచ్చిన్నట్లు నమోదు చేశారు. మిగిలిన గ్రామాలలో కూడా తనిఖీలు పూర్తయితే అక్రమాలు ఇంకా బయట పడతాయని ప్రజలు చెబుతున్నారు. అధికారులు ముందుగా వెళ్లి కూలీలకు ఎలాంటి అవకతవకలు జరగలేదని చెప్పాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.


కూకట్లపల్లిలో పనులలో జరిగిన లోపాలను వివరిస్తున్న తనిఖీ బృందం

నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీలు

సామాజిక తనిఖీల బృందాలు గతంలో జరిగిన తనిఖీల కంటే ఈసారి కఠినంగా వ్యవహరిస్తున్నాయి. అన్ని రకాల వివరాలను సేకరిస్తున్నారు. పనుల వద్ద కొలతలు పూర్తి స్థాయిలో చేపడుతున్నారు. ఎక్కడైన అనుమానాలు ఉంటే వెంటనే పనులు చేసిన ఫొటోలను పరిశీలిస్తున్నారు.

నేడు నాలుగు గ్రామాలలో గ్రామసభలు

ఉపాధి పనుల సామాజిక తనిఖీలు జరిగిన గుంటుపల్లి, కొమ్మినేనివారి పాలెం, ముక్తేశ్వరం, అంబడిపూడి గ్రామాలలో గురువారం గ్రామసభలు జరగనున్నాయి. ఈ సభలలో కూలీల సమక్షంలో తనిఖీలు చేసిన విధానం, పనులలో జరిగిన లోపాలను తనిఖీ బృందాలు వెల్లడిస్తాయి. వచ్చే నెల 6 వ తేదీన మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహించి అన్ని గ్రామాలలో చేపట్టిన తనిఖీల వివరాలను వెల్లడించనున్నారు.

చీరాలలో పాత నేరస్థుడు హల్‌చల్

హైవేలో వాహనాలు నిలిపి కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్
ఓ లారీ డ్రైవర్ అడ్డం తిరగడంతో వ్యవహారం బట్టబయలు
విషయం తెలుసుకుని హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై చంద్రశేఖర్
పోలీసులు రంగప్రవేశంతో పరారైన పాత నేరస్థుడు
దగ్గర కొస్తే కత్తితో కోసుకుంటానని గొంతుకు గాయం

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు బాగా ముదిరారు. ఇష్టం వచ్చిన విధంగా నేరాలకు పాల్పడటం, తేడా వస్తే వ్యక్తిగత దాడులు చేసుకుని పరారవుతుండటం పరిపాటిగా మారింది. మండల పరిధిలోని ఈపూరుపాలెం-స్వర్ణపురం జాతీయ రహదారిలోని సరిహద్దు వద్ద బుధవారం మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. రామనగర్‌కు చెందిన పాత నేరస్థుడు రెండు మండలాలకు చెందిన సరిహద్దులోని 216 జాతీయ రహదారిలో వాహనాలు అడ్డగించి కత్తి చూపించి బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఈ తంతు జరుగుతుండగా పశువుల లోడుతో వెళుతున్న లారీని ఆపి డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో డ్రైవర్ నిరాకరించాడు. ఈక్రమంలో కొద్దిసేపు వాదోపవాదనలు మధ్య గుట్టు చప్పుడుగా డ్రైవర్ ఈపూరుపాలెం పోలీసులకు సమాచారం చేరవేశాడు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందిని చూసి నేరగాడు పక్కన పొలాల్లోకి పరుగులు తీశాడు. పోలీసులు వెంబడించే ప్రయత్నం చేశారు. నేరగాడు అతని వద్ద ఉన్న కత్తితో 'మీరు దగ్గరికి వస్తే నేను కోసుకుంటా'నని బెదిరించసాగాడు. దీంతో పోలీసులు అవాక్కయ్యారు. అయినప్పటికీ ముందుకు వెళ్లే ప్రయత్నంగా చేయగా నేరగాడు కత్తితో గొంతుపై, చేతులపై రెండు చోట్లా కోసుకుని రక్తగాయాలు చేసుకున్నాడు. ఇంకా ముందుకొస్తే చచ్చిపోతానని బెదిరిస్తూ పొలాల్లోకి పారిపోయాడు. దీంతో పోలీసులు వెనుదిరిగారు. వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. మంగళవారం నాడే ఆంధ్రజ్యోతి పాత నేరస్థులతో కొత్త సవాళ్లు శీర్షికలో ఈ తరహా ముదిరినట్లు వివరించిన సంగతి పాఠకులకు విదితమే.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య వివాదం

విషయం తారస్థాయికి చేరి
ఆటో దహనం
పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు
ఇప్పటికే వేటపాలెం పోలీసుల అదుపులో ఒకరు

వేటపాలెం/చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చినగంజాంకు చెందిన ఇరువురు స్నేహితులు మద్యం సేవిస్తూ ఘర్షణ పడ్డారు. దీంతో వీరిలో ఒకరికి చెందిన ఆటోను తగులబెట్టుకుని పరస్పరం అభియోగాలు చేసుకున్నారు. అందిన వివరాల ప్రకారం... చినగంజాంకు చెందిన షమీర్ వేటపాలెంలోని ఓ పంక్చర్ షాపులో పనిచేస్తున్నాడు. అతని మిత్రుడు చినగంజాంకు చెందిన వీర్ల బాబు బుధవారం వేటపాలెం వచ్చాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవిస్తుండగా ఘర్షణ పడ్డారు. దీంతో 216 జాతీయ రహదారిలో ఆటో తగులబెట్టుకుని, నువ్వే చేశావంటే.. నువ్వే చేశావని ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న వేటపాలెం పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇప్పటికే ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేశారు.


కాలిపోతున్న ఆటో

డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కేసులు

బల్లికురవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని బాపట్ల ఆర్టీవో ప్రసన్నకుమారి హెచ్చరించారు. బుధవారం బల్లికురవ మండలంలో ఇటీవల రెండు ప్రమాదాలలో పోలీసు స్టేషన్‌కు తరలించిన రెండు వాహనాలను ఆర్టీవో పరిశీలించారు. అనంతరం వాహనాలను రిలీజ్ ఆర్డర్ ఇచ్చారు. అనంతరం పలు కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకుడి మృతి


మృతి చెందిన యాచకుడు

మార్టూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : ఇంద్ర ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... టోల్‌ప్లాజా వద్ద ఒంగోలు వైపు ఆగిన ఆర్టీసీ బస్సు నుంచి ప్రయాణికులు దిగుతున్న సమయంలో డ్రైవరు దగ్గర ఒక యాచకుడు డబ్బులు తీసుకొని, పక్కకు వస్తున్న సమయంలో ఒంగోలువైపు వెళుతున్న ఇంద్ర బస్సు యాచకుని ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన యాచకుడి తలకు దెబ్బతగిలింది. దాంతో సమీపంలోని హైవే అంబులెన్స్‌లో యాచకున్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలోనే అతను చనిపోయాడు. అతనికి సుమారు 30 ఏళ్ల వయస్సు ఉంటుందని అక్కడి వాసులు తెలిపారు. టోల్ ప్లాజా మేనేజరు కిరణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులు దహన సంస్కార కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్ఐ సైదా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సంతమాగులూరు జులై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని పుట్ట సమీపంలో నడుచుకుంటూ వస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బాడీ నుజ్జునుజ్జుకావడంతో మృతుడి వివరాలుతెలియ లేదని పోలీసులు చెప్పారు.

ఇంటిలో చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మార్టూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు పంచాయతీలోని కొణిదెన రోడ్‌లో అమ్మ ఆశ్రమం సమీపంలో మంగళవారం వేకువజామున కొండముది కల్యాణి ఇంటిలో జరిగింది. ఈ చోరీపై బుధవారం ఆమె స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాశీ పుణ్యక్షేత్రం నుంచి తిరిగి వచ్చిన కల్యాణి ఇంటిలోకి రాగానే చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న 12 గ్రాముల బంగారు చైను, రెండు వెండి ఉంగరాలు, వెండి కలశం, ప్యాంట్లు, 2చొక్కాలతో పాటు రూ.10 వేల నగదును దొంగలు ఎత్తుకుపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడులు

రామనగర్(చీరాల), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బుధవారం రామనగర్‌లో పేకాట శిబిరంపై టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈక్రమంలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.4350ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగశ్రీను తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

మార్టూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కోలలపూడి గ్రామంలో బుధవారం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, కలాలు, బిస్కట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మాదాల సాంబశివరావు, తాటి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రవికుమార్ పాల్గొన్నారు.

జనసైనికులు పూజలు

పర్చూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : హరిహర వీరమల్లు సినియా విజయవంతం కావాలని కోరుతూ జనసైనికులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక 92 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈకార్యక్రమంలో శంకరశెట్టి చిరంజీవి, విన్నకోట అజేయ్, సందీప్ తేజ, సాకిరి శ్రీను పాల్గొన్నారు.

అవీఇవీ

25న రామకూరు ఆలయ భూములకు కౌలు వేలం

పంగులూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ భూములకు కౌలు వేలం ఈనెల 25వ తేదీన జరుగుతుందని కార్యనిర్వాహక అధికారి సుబ్బారావు తెలిపారు. సర్వే నెంబరు 136లోని 12 ఎకరాలతోపాటు సర్వే నెంబరు149లో గల 8 ఎకరాల 31 సెంట్ల మెట్టభూమికి రానున్న మూడేళ్ల కాలపరిమితిలోపు కౌలువేలం నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయ భూములకు వేలం జరుగనుందని తెలిపారు. వేలంలో పాల్గొనువారు ముందుగా 5వేల రూపాయల ధరావత్తు చెల్లించాలని వివరించారు.

ఆ పథకం రానివారు గ్రీవెన్స్‌లో పెట్టుకోవాలి

మేదరమెట్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత ఉండి లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాని వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయ అధికారి రామ్‌మోహన్‌రెడ్డి చెప్పారు. బుధవారం కొరిశపాడు, బొల్లవరప్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం పొడిగించారన్నారు. ఈ పథకం కింద పత్తి, వేరుశనగ పంటలకు బీమ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. పత్తి పంట సాగు చేసిన రైతులు పంట ధ్రువీకరణ పత్రం తీసుకుని సీఎస్సీ కేంద్రాల్లో పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఎర్ర మిరప, మినుములు, కంది పంటకు కూడా ఈ నెల 31వ తేదీలోపు, వరి పంటకు ఆగస్టు 15 వరకు పంటల బీమా నమోదు చేసుకోవచ్చన్నారు. తేమ 20శాతంలోపు ఉన్న పొగాకు చెక్కులను కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్.ఐ రమేష్, ఉపాధ్యాయులు

చినగంజాం, జూలై 23(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చినగంజాం ఎస్ఐ శీలం రమేష్ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యాంటి డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన అవగహన సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. వ్యక్తిగత వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సైబర్ నేరగాళ్లకు చిక్కినట్లేనన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలు గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దని అన్నారు. ఫోనులలో వచ్చే సందేశాలను పూర్తిగా చదవకుండా అనుమతి కొట్టవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి

మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు


పైపుల మరమ్మతులను పరిశీలిస్తున్న చైర్మన్ సాంబశివరావు

చీరాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు పారదర్శకంగా కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు చెప్పారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన చైర్మన్ నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రజల నుండి వచ్చిన అర్జీల మేరకు 5వ వార్డు, పేరాల రైల్వే గేటు సమీపంలోని తాగునీటి పైపులు లీకేజీ, డ్రెయిన్‌ల మరమ్మతులు చేపట్టారు. ఆ పనులను బుధవారం డీఈ రఘురామ్, ఇంజనీరింగ్ ఏఈ రవికుమార్‌లతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి


మొక్కలను నాటుతున్న ఎంఈవో వస్రాంనాయక్

మార్టూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, వాటిలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందనిఎంఈవో వస్రాం నాయక్ చెప్పారు. బుధవారం ఆయన మండలంలోని బొబ్బేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. మొదట ఆయన ముస్లింకాలనీలోని ఉర్దూపాఠశాలను పరిశీలించారు. అనంతరం హెచ్‌ఈ మోడల్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 21 మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఎంపికచేశామన్నారు. ఈ పాఠశాలల్లో 1 నుండి 5 తరగతులకు, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారని చెప్పారు. అనంతరం స్కూలు ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

మురుగునీటితో అపరిశుభ్రవాతావరణం

యద్దనపూడి/మార్టూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో మురుగునీరు నిలబడటంతో గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. మూడు నాలుగు రోజులనుంచి వర్షాలు కురుస్తుండడంతో మురుగు నిల్వలు పెరిగి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దానికి తోడు సైడుకాల్వల్లో మురుగు నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పరిశుభ్రత, పచ్చదనంపై ప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టాలని చెబుతుండగా, ఇక్కడ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


మీ సేవా కేంద్రం భవనం వద్ద నిలబడిన మురుగునీరు